
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
5
జిల్లా వార్తలు
శుక్రవారం 21 నవంబరు 2025



సత్యసాయికి అక్షర నివాళి

● బాబా జీవిత చరిత్రతో చిత్రం

నంద్యాల కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఏ3 డ్రాయింగ్ షీట్‌పై సత్యసాయిబాబా జీవిత చరిత్రను జెల్ పెన్నుతో తెలుగు అక్షరాలతో చిత్రాన్ని వేశారు. ఈ చిత్రంలో సాయిబాబా భక్తులకు చిరునవ్వుతో ఆశీస్సులు అందజేసినట్లు వేశారు. సాయిబాబా జననం నుంచి మరణం వరకు ముఖ్యమైన అంశాలను పొందుపరిచారు. బాల్యం, ఆధ్యాత్మిక ప్రస్థానం, సత్యసాయి బోధనలు, సంక్షేమ కార్యక్రమాలను చిత్రంలో వేశారు.





13న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న బి.లీలా వెంకటశేషాద్రి

కర్నూలు లీగల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు డిసెంబరు 13న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి కోరారు. ఈ మేరకు గురువారం కర్నూలు నగరంలోని న్యాయ సేవా సదన్ భవన్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసులు, మోటారు యాక్సిడెంటు కేసులు, బ్యాంకు మున్సిపాలిటీ, బీఎస్ఎన్ఎల్ కేసులతో పాటు ప్రిలిటిగేషన్ కేసులను కూడా ఈ లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకుని తమ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలు బ్యాంక్ మేనేజర్లు, మున్సిపల్ అధికారులు, ఇన్సూరెన్స్, బీఎస్ఎన్ఎల్ అధికారులు పాల్గొన్నారు.

జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలు



అబ్దుల్ రహమాన్

నంద్యాల రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలు ఏర్పాటు చేసినట్లు మార్కెటింగ్ ఏడీ అబ్దుల్ రహమాన్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నంద్యాలలోని శ్రీమురారి పవన్ ఆగ్రో, ఎన్‌సీ ఆగ్రో జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేవలం ఎకరానికి ఏడు క్వింటాళ్ల మాత్రం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు పత్తిని తెచ్చే ముందు రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్, కపాస్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకుని తీసుకురావాలన్నారు. ఇవన్ని విలేజ్ అగ్రికల్చరల్ అధికారి ద్వారా చేసుకుని రావాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలన్నారు.

ఎస్ఎస్ఏ నూతన ఏపీసీగా నిత్యానందరాజు

ప్రస్తుత ఏపీసీ కడపకు బదిలీ



నంద్యాల, నవంబరు20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న పలువురు ఎస్ఎస్ఏ ఏపీసీలను గురువారం బదిలీ చేస్తూ ఆ శాఖ సెక్రెటరీ కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా జిల్లా ఎస్ఎస్ఏ ఏపీసీగా పనిచేస్తున్న ప్రేమంత్‌కుమార్‌ను కడప జిల్లా ఎస్ఎస్ఏ ఏపీసీగా.. అక్కడ పనిచేస్తున్న నిత్యానందరాజును ఇక్కడికి బదిలీ చేశారు. దీంతో నూతన ఎస్ఎస్ఏ ఏపీసీగా నిత్యానందరాజు త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇదిలా ఉండగా... ప్రస్తుత ఏపీసీ ప్రేమంత్‌కుమార్ గత ఏడాది డిసెంబరు 28వ తేదీన ఇక్కడ బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. సుమారు 11 నెలలకు పైగా ఏపీసీగా సేవలందించినట్లైంది.

వన్య ప్రాణులను వేటాడితే జైలుకే

- ఏడేళ్లు జైలుశిక్ష, జరిమానా
- ముర్తుజావలి, ఫారెస్టు రేంజర్

6

బతుకు భారమైన మత్స్యకారులు



పోతిరెడ్డిపాడు వద్ద కాల్వల్లో చేపలు పడుతున్న మత్స్యకారులు



జీవ వైవిధ్యం, ఆహార భద్రత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అనే మూడింటితో ముడిపడినదే మత్స్యఉత్పత్తి రంగం. లక్షలాది మంది ఉపాధికి మత్స్య సంపద ఎంతో కీలకం. కాలుష్యం, పెరుగుతున్న ఎండల ప్రభావంతో చేపల ఉత్పత్తి క్రమేణా తగ్గుతోంది. నంద్యాల జిల్లాలో ప్రత్యేకమైన భౌగోళిక నిర్మాణం, వర్షాధార జల వనరులు, చెరువుల వ్యవస్థ, కాలానుగుణ ఉష్ణోగ్రత మార్పులు మొదలైనవి మత్స్య ఉత్పత్తిపై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయి. దీని వల్ల మత్స్యకారులకు బతుకు భారమైపోయింది. ప్రతి యేటా నవంబరు 21 జరుపుకునే ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా మత్స్యకారుల సమస్యలు చర్చనీయాంశం అవుతాయి. దీన్ని పురస్కరించుకొని ప్రత్యేక కథనం.

- చెరువుల్లో పెరుగుతున్న మత్స్య సంపద
- వేసవి సీజన్‌లోనూ చేపల సాగు
- జిల్లాలో 4,638 మంది మత్స్యకారులు
- 80వేల మెట్రిక్ టన్నులు లక్ష్యంగా ముందుకు..

నంద్యాల ఎడ్యుకేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చేపల వేట అంటే అనగానే సముద్రం, అలలు, పడవలు గుర్తుకొస్తాయి. కానీ నంద్యాల జిల్లాలో మాత్రం రిజర్వాయర్‌లు, చెరువులు, కుంటలు మత్స్య సంపదకు నిలయాలు. జిల్లాలో రెండు వేల హెక్టార్లకు పైగా విస్తీర్ణంతో శ్రీశైలం, వెలుగోడు రిజర్వాయర్లు ఉన్నాయి. వీటి ద్వారా లైసెన్స్ ఉన్న 448 మత్స్యకారులు వాటిలో ఉచితంగా చేపలు పట్టుకుంటూ జీవిస్తున్నారు. అలాగే గోరుకల్లు, అవుకు, అలగనూరు, తుండ్లవాగు, జుర్రేరు జలాశయాల్లో, 124 చెరువుల్లో జిల్లా మత్స్యశాఖ చేపలు పెంచుతున్నారు. 2025-26 సంవత్సరం 61,417 టన్నుల చేపల ఉత్పత్తి లక్ష్యం కాగా అక్టోబర్ నెల చివరి నాటికి 30,528 టన్నుల చేపలు, 20.05 టన్నుల రొయ్యల ఉత్పత్తి సాధించారు.

జిల్లాలో ప్రధాన చేపల రకాలు

జిల్లాలో ప్రధానంగా చెరువులు, జలాశయాల్లో సహజసిద్ధంగా అభివృద్ధి చెందుతున్న చేపల్లో మాగుర్‌చేప, మార్ఫ్‌చేప(సింగి), వీడ్‌షైనర్‌చేప, చందువా(గ్లాస్‌ఫిష్) చేపలున్నాయి. అలాగే పెంపకం చేపడుతున్న రకాల్లో కొరమీను, బొచ్చె, ఎర్రమొస, బంగారుతీగ, రాగండి, గడ్డిచేప, ఎర్రచందువా, జిలేబి చేపలున్నాయి. వీటిలో అధికంగా బంగారు తీగ, కొరమీను రకాలకు మంచి డిమాండ్ ఉంది.

● బలపడుతున్న మత్స్యకార సంఘాలు

జిల్లాలో 70 మత్స్య సహకార సంఘాలుండగా వాటిలో 4455 మంది పురుష మత్స్యకారులు, మూడు మహిళా మత్స్యకార సంఘాల్లో 183 మంది మహిళా మత్స్యకారులు ఉన్నారు. మత్స్య సహకార సంఘాల బలోపేతానికి ఎన్‌డీసీసీ ద్వారా ఎఫ్ఎఫ్‌పీవోలు ఏర్పాటు చేశారు. ప్రమాదవశాత్తూ మరణించిన మత్స్యకారులకు ప్రభుత్వం ప్రమాద బీమా ద్వారా రూ.10లక్షలు అందజేస్తున్నారు. మత్స్యకార యువతకు ఉపాధి కల్పించేందుకు నేటి వరకు 99 యూనిట్లు మంజూరు చేశారు. 36 టీవీఎస్ మోపెడ్‌లు, నాలుగు త్రీవీలర్‌లు, మూడు ఫిష్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు, ఒక ఫిష్ కియోస్క్, 53 మినీ ఫిష్ కియోస్క్‌లు, రెండు లాంజ్ యూనిట్‌లు మంజూరు చేశారు. 40శాతం, 60శాతం రాయితీతో రూ.1,41,67,118 మంజూరు చేశారు.



నంద్యాల చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం

వెలుగోడు రిజర్వాయర్‌లో 21.15 లక్షల చేప పిల్లలు విడుదల

జిల్లాలోని నంద్యాల సమీపంలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం నుంచి 1.10 కోట్ల చేపగుడ్ల ద్వారా 25 లక్షల చేప పిల్లలను ఉత్పత్తి చేశారు. అందులో ఇటీవల వెలుగోడు రిజర్వాయర్‌లో 21.15 లక్షలు చేపపిల్లలను వదిలారు. మిగిలిన 3.85 లక్షల పిల్లలను వివిధ మత్స్యకార సంఘాల ద్వారా చెరువుల్లో, జలాశయాల్లో వదిలారు. చేపలను ప్రధానంగా హైదరాబాద్, బే ఆఫ్ బెంగాల్. బెంగళూరు రాష్ట్రాలకు అత్యధికంగా ఎగుమతి జరుగుతోంది.

ఏటా 80వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా..



స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ డాక్యుమెంట్ ప్రకారం నంద్యాల జిల్లా నుంచి ప్రతియేటా 15శాతం వృద్ధి రేటుతో 80వేల మెట్రిక్ టన్నుల చేపల ఉత్పత్తి లక్ష్యంతో ముందుకెళ్తున్నాము. చేపల వేట నిషేధ కాలమైన జూలై, ఆగస్టు నెలలు మినహాయించి మిగిలిన 10 నెలలు చేపలు పట్టుకునేందుకు లైసెన్స్‌లు జారీ చేశాము. చేపల వేట ప్రధాన వృత్తి కల్గి 50యేళ్లకు పైగా ఉన్న మత్స్యకారులకు నేటి వరకు 1815 మందికి పింఛన్‌లు కూడా మంజూరు చేశాం.

- హీరానాయక్, జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్, నంద్యాల జిల్లా

మరిన్ని కథనాలు 6లో

కేంద్ర పథకాల్లో జాప్యం తగదు

● ఎంపీ, దిశ కమిటీ చైర్మన్ బైరెడ్డి శబరి

జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలి

● కలెక్టర్ రాజకుమారి

నంద్యాల, నూనెపల్లి 20 (ఆంధ్రజ్యోతి) : వివిధ శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో జాప్యానికి తావులేకుండా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ(దిశా) కమిటీ చైర్మన్ బైరెడ్డి శబరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో బైరెడ్డి శబరి అధ్యక్షతన దిశా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించిన నిధులు పూర్తిస్థాయిలో వినియోగించుకోకపోవడంతో రూ. వందల కోట్లు వెనక్కి వెళ్లిపోవడం బాధాకరమన్నారు. జిల్లాలోని ఏ ఏ శాఖలకు ఏమేం నిధులు అవసరమో నివేదిక తయారు చేసి తమకు పంపాలని అధికారులకు సూచించారు. విద్యాశాఖ భవనాల మరమ్మతులకు మంజూరైన నిధులను వినియోగించుకోవాలన్నారు. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద మంజూరు చేసిన 60 శాతం వాటాను పూర్తిస్థాయిలో వినియోగించుకొని రైతులను ప్రోత్సహించాలన్నారు. కొన్ని చోట్ల జాతీయ రహదారులు మరమ్మతుకు గురయ్యాయని నేషనల్ హైవే అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కొళాయి కనెక్షన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. జిల్లాలో రైతుల శ్రేయస్సు కోసం రాష్ట్ర ప్రభుత్వం 10,600 సాయిల్ హెల్త్ కార్డులు ఇచ్చినట్లు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలో జిల్లాలో 5.20 లక్షల మందికి ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్(ఏబీహెచ్ఏ) కోసం ఈ-కేవైసీ చేసినట్లు తెలిపారు. తాగునీటి సరఫరాకు ఆర్వో ప్లాంట్లు మంజూరు చేసి, బోర్, విద్యుత్ కనెక్షను ఇవ్వాలని అన్నారు.

మిగతా 8వ పేజీలో



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శబరి, కలెక్టర్





తక్కెడతో పత్తిని తూకం వేస్తున్న దృశ్యం

మహా మోసం

- పత్తి రైతులను మోసగిస్తున్న మహారాష్ట్ర వ్యాపారులు
- నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల వద్ద తూకాలు
- క్వింటాకు 20 కిలోల కోత
- అధిక ధర ఆశ చూపి అన్యాయం

ఆదోని, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రేయనక..పగలనకా నాలుగు నెలలు కష్టపడి పండించిన పత్తిపంటను మహారాష్ట్ర వ్యాపారులు దోచుకుంటున్నారు. అధిక ధర ఆశచూపిస్తూ ఇళ్లవద్దే పత్తిని కొనుగోలు చేస్తున్నారు. తక్కెడ వాళ్లవే.. తూకం రాళ్లూ వాళ్లవే.. ఇంకేముంది కిలోల కొద్ది తక్కువతూకాలతో రైతులను నిండా ముంచేస్తున్నారు. అడ్డగోలుగా తూకాలు వేస్తూ పత్తి రైతులను ఏమార్చుతూ మోసగిస్తున్నారు. ప్రస్తుతం ఆదోని మార్కెట్‌లో మంచి నాణ్యత గల పత్తి క్వింటా రూ.7,330 వరకు గరిష్ఠ ధర పలుకుతోంది. అయితే మహారాష్ట్రకు చెందిన వ్యాపారులు రంగంలోకి దిగి పత్తి నాణ్యత (క్వాలిటీ)తో సంబంధం లేకుండా కేవలం రూ.7,300 చొప్పున ధర ప్రకటించి రైతులను ఆకర్షిస్తున్నారు. ఆదోని మార్కెట్‌లో లభించే గరిష్ఠ ధరకు దగ్గరగా ఈ రేటు ఉండడంతో రైతులు తమ దిగుబడులను మార్కెట్‌కు కాకుండా నేరుగా మహారాష్ట్ర వ్యాపారులకే అమ్ముకుంటున్నారు. మార్కెట్‌కు వెళ్లకుండా రవాణా ఖర్చులు కలసివస్తాయని రైతుల ఆశ. అయితే ఈ ఆశనే వ్యాపారులు గుర్తించి పత్తి కొనుగోలు చేసే సమయంలో తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. ఎలక్ట్రానిక్ కాటాలకు బదులు తక్కెడలను వినియోగిస్తున్నారు. నిజానికి తూనికలు కొలతల శాఖ ఆదేశాల మేరకు భారీ మొత్తంలో జరిగే కొనుగోళ్లకు ఎలక్ట్రానిక్ కాటాలు మాత్రమే వాడాలి. ఎలక్ట్రానిక్ కాటాల్లో మోసం చేయడానికి అవకాశం ఉండదు. కానీ మహారాష్ట్రకు చెందిన వ్యాపారులు మాత్రం ఈ ఆదేశాలను బేఖాతరు చేస్తూ పాత తక్కెడ తూకాలను ఉపయోగిస్తున్నారు.

క్వింటాకు రూ.20 కిలోల వరకు మోసం

కౌతాళం, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆలూరు, హొళగుంద మండలాల చుట్టుపక్కల గ్రామాలకు లారీలను తీసుకెళ్లి రైతుల ఇళ్ల వద్దనే పత్తిని కొనుగోలు చేస్తున్నారు. 10 క్వింటాళ్ల పత్తి పైబడి ఉన్న రైతుల వద్దకే వెళ్లి వారు కొనుగోలు చేస్తారు. తూకం వేసేటప్పుడు ఒకవైపు 50 కిలోల రాళ్లు, మరోవైపు పెద్ద సంచిని (డంప్ బ్యాగ్) వేలాడదీస్తారు. మోసపూరిత పద్ధతుల ద్వారా పత్తి తూకంలో క్వింటాకు 10 నుంచి 20 కిలోల వరకు మోసం చేస్తున్నట్లు తెలుస్తోంది. క్వింటా సగటు ధర రూ.7300 అనుకుంటే ఒక క్వింటా మోసానికి పది నుంచి 20 కేజీల వరకు నష్టం ఉంటుంది. మొత్తంమీద 10 క్వింటాళ్లకు అమ్మితే రెండు క్వింటాళ్ల వరకు నష్టం జరుగుతుంది. రైతుకు దాదాపు రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు నష్టం ఉంటుంది. ఈ వ్యాపారస్తులంతా మార్కెట్ యార్డు పరిధిలో కాకుండా నేరుగా రైతుల వద్ద కొనుగోలు చేసి రాత్రికి రాత్రే లారీల్లో పత్తిని మహారాష్ట్రకు తరలిస్తున్నారు. దీంతో మార్కెట్‌యార్డుకు చెల్లించాల్సిన సెస్సు (పన్ను) ప్రభుత్వానికి అందకుండాపోతోంది. రోజుకు సగటున 8 నుంచి 10 లారీల్లో పత్తి తరలిపోతుండగా ప్రభుత్వ ఖజానాకు రూ.లక్షల్లో గండి పడుతోంది. పది రోజుల నుంచి ఈ దోపిడీ ముమ్మరంగా జరుగుతున్నా మార్కెట్‌యార్డు అధికారులు, తూనికలు కొలతల శాఖ అధికారులు స్పందించడం లేదు.

అంగన్‌వాడీ చిన్నారులకు అస్వస్థత



ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న చిన్నారులతో మాట్లాడుతున్న పీడీ

పాములపాడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రంలోని ఎనిమిది మంది చిన్నారులు అస్వస్థతకు గురై వాంతులు, విరేచనాలు అయ్యాయి. దీంతో తల్లిదండ్రులు హుటా హుటిన చికిత్స నిమిత్తం సమీప పట్టణాలలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలకు తరలించారు. ఈ ఘటనతో అధికారులు అప్రమత్తమయ్యారు. మండలంలోని మిట్టకందాల గ్రామంలోని అంగన్‌వాడీ 3వ కేంద్రంలో బుధవారం 16 మంది చిన్నారులకు గాను 13 మంది హాజరయ్యారు. వీరికి ఉదయం గుడ్డు, మధ్యాహ్నం అన్నం ఆకుకూర పప్పు, సాయంత్రం పాలను టీచర్ అరుణ, ఆయా అందించారు. అయితే రాత్రి ఎనిమిది గంటల సమయంలో చైతన్యకుమార్, అలేఖ్య, సంధ్య, రితిన్, నిక్షిత్‌కుమార్, రిషి, చార్లెస్‌రాజ్, వసుంధర అనే ఐదు సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు విరేచనాలు కావడంతో మొదట పాములపాడు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు నలుగురు, ప్రైవేటు ఆసుపత్రికి ముగ్గురు, నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. పీడీ లీలావతి, సీడీపీవో మంగవల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి సంఘటనకు గల కారణాలను సిబ్బందిని అడిగి తెలుసుకొని ఆత్మకూరు చేరుకొని చికిత్స పొందుతున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను వైద్యులను అడిగి తెలుసుకొన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఖాశీంవలి, వెంకటరమణ చిన్నారులకు ఇచ్చిన ఆహారం, తాగిన నీరు, వంటకు వాడిన బోరునీటి నమూనాలు సేకరించి టెస్టుల కోసం ల్యాబ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. వైద్యులు నాగలక్ష్మి, జాకీర్‌బాషా, వైద్య సిబ్బంది చికిత్స పొందుతున్న చిన్నారులను పర్యవేక్షించారు. తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎస్ఐ సురేశ్‌బాబు సంఘటనపై వివరాలు సేకరించారు. చికిత్స పొందుతున్న చిన్నారులు కోలుకుంటున్నారని, ఎవరికీ ఎలాంటి ప్రమాదం లేదని చిన్నారుల తల్లిదండ్రులు, అధికారులు తెలిపారు.. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చిన్నారులపై అధికారులు శ్రద్ధ తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



చిన్నారులను పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

అస్వస్థతకు గురైన చిన్నారుల తల్లిదండ్రులతో డైరెక్టర్, కలెక్టర్ సమావేశం

పాములపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టకందాల గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులు ఎనిమిది మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయంపై గురువారం రాత్రి గ్రామానికి ఐసీడీఎస్ రాష్ట్ర డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి అంగన్వాడీ టీచర్ అరుణ, ఆయా మంజులను అస్వస్థతకు గల కారణాలపై ఆరా తీశారు. నిల్వ ఉన్న గుడ్లు, పాల ప్యాకెట్లు, రిజిస్టర్లు పరిశీలించారు. చిన్నారుల వయస్సుకు తగ్గ బరువు ఉన్నారా, పోషకాహార లోపాలు ఉన్నాయా? అంటూ ప్రశ్నించారు. అనంతరం అస్వస్థతకు గురైన చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం ఆవరణలోని టాయ్‌లెట్స్‌ను, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ లీలావతి, ఆర్డీవో నాగజ్యోతి, సీడీపీవో మంగవల్లి, తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలి'

పాములపాడు మండలం మిట్టకందాల గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో అస్వస్థతకు గురైన చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని టీడీపీ నాయకుడు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి వైద్యులను కోరారు. గురువారం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకొని చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించి వారి తల్లితండ్రులతో సంఘటనపై ఆరా తీశారు. మార్కెట్‌యార్డ్ చైర్మన్ ప్రసాదరెడ్డి, కన్వీనర్ రవీంద్రరెడ్డి, నాయకులు తిమ్మారెడ్డి, హరినాథరెడ్డి, హరిప్రసాద్, మల్లికార్జునయాదవ్, సురేశ్, లింగస్వామిగౌడ్, అమర్‌నాథ్, కరీంబాషా తదితరులు ఉన్నారు.

పాలు, గుడ్లు, నీటిని పరిశీలించిన అధికారులు

ఆహార పదార్థాలు ల్యాబ్‌కు : కలెక్టర్

ఆత్మకూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మిట్టకందాల అంగన్‌వాడీ సెంటర్‌కు సరఫరా అయ్యే అన్ని ఆహార పదార్థాల నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించామని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. బయలాజికల్ రిపోర్టు రాగానే పూర్తి వివరాలు వెల్లడిస్తామని అన్నారు. గురువారం బాధిత చిన్నారులను పరామర్శించేందుకు స్త్రీసంక్షేమశాఖ కమిషనర్ వేణుగోపాల్‌తో కలిసి ఆత్మకూరులో మీడియాతో మాట్లాడారు. అంగన్‌వాడీ-3 సెంటర్‌లో అస్వస్థతకు గురైన చిన్నారులు ప్రస్తుతం సురక్షితంగా ఉన్నారని తెలిపారు. మిట్టకందాల గ్రామంలోని అంగన్‌వాడీ-3 సెంటర్‌లో బుధవారం 13 మంది చిన్నారులు హాజరు కాగా వారిలో ఏడుగురు అస్వస్థతకు గురయ్యారన్నారు. ప్రస్తుతం క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. గ్రామానికి సరఫరా జరిగే అన్ని నీటి పథకాలను పరీక్షించామన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ నాగజ్యోతి, తహసీల్దార్ రత్నరాధిక, ఐసీడీఎస్ పీడీ లీలావతి, ఆత్మకూరు సీడీపీఓ కోటేశ్వరమ్మ తదితరులు ఉన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రాష్ట్ర డైరెక్టర్, కలెక్టర్

సంగమేశ్వరంలో వలస మత్స్యకారులు


వెలుగోడు జలాశయం వద్ద చేపల విక్రయ కేంద్రంలోని దృశ్యం

ఆత్మకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సప్తనదీ సంగమేశ్వరంలో కొన్నేళ్లుగా వైజాగ్, కాకినాడ తదితర ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు వలస వచ్చి చేపల వేట సాగిస్తున్నారు. కృష్ణాతీరంలో చిన్న పాటి గుడారాలను ఏర్పాటు చేసుకుని ప్రతి రోజు చేపలవేటకు సిద్ధమవుతుంటారు. సంగమేశ్వరంలో ప్రతిఏటా 8నెలల పాటు నదీజలాలు ఉండటంతో ఇక్కడే తాత్కాలిక నివాసాలను ఏర్పాటు చేసుకుంటారు. నీటినిల్వలు తగ్గిన తర్వాత అక్కడి నుంచి తమ సొంత ప్రాంతాలకు వెళ్తుంటారు. కాగా తుంగభద్ర, కృష్ణా నదీ జలాల్లో కట్ల, రోహు, మృగల, బంగారుతీగ రకాల చేపలు ఎక్కువగా పెంచుతారు. ఇవే కాకుండా వివిధ రకాల చేపలు లభ్యమవుతున్నాయి. ప్రతిరోజు సాయంత్రం



జలాల్లో వలలు వేసి ప్రాతఃకాల సమయం నుంచే వలల్లో చేపలతో చిక్కుకున్న వలల్ని సేకరించి చేపలను పడతారు. ఆయా ప్రాంతాల్లో లభించే చేపలు మంచి రుచిగా ఉండటంతో కలకత్తా, చెన్నై, హైద్రాబాద్, ఒంగోల్, కేరళ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. కృష్ణా తీరంలోని పలు గ్రామాల్లోని మత్స్యకారులు మార్కెటింగ్ సదుపాయం లేక దళారుల చేతుల్లో నష్టపోతున్నారు. ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తే ప్రయోజనం వుంటుందని మత్స్యకారులు చెబుతున్నారు. ఇదిలావుంటే సంగమేశ్వరంలో అలివి వలల వినియోగంతో మత్స్యసంపద వృద్ధికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

కనిపించని రాయితీ పథకాలు

గతంలో టీడీపీ ప్రభుత్వంలో మత్స్యకారుల కోసం పలు రాయితీ పథకాలు అందుబాటులో ఉండేవి. అయితే వైసీపీ అధికారంలోకి రాగానే అనేక పథకాలు ఈ పథకాలన్ని రద్దు చేయడం జరిగింది. కేవలం సముద్రాల్లో చేపలు పట్టే మత్స్యకారులకు మాత్రమే మత్స్యకార భరోసా కింద ప్రభుత్వం ఏటా రూ.10వేల వరకు సాయాన్ని అందించింది. అయితే జలాశయాల పరిధిలో జీవనం సాగించే మత్స్యకారులకు ప్రభుత్వ సాయం లేకపోవడంతో వారందరు తీవ్ర నిరాశకు లోనయ్యారు. మత్స్యశాఖ అధికారులు కూడా మత్స్యకారుల సంక్షేమానికి, మత్స్య సంపద అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



నదినే నమ్ముకొని జీవనం పోరాటం సాగిస్తున్న మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రత్యేక రాయితీ పథకాలను అమలు చేయాలి. గత వైసీపీ పాలనలో కేవలం సముద్రాల్లో చేపలు పట్టే మత్స్యకారులకు మాత్రమే మత్స్యకారుల భరోసా పథకం ద్వారా ప్రతిఏటా రూ.10వేల వరకు సాయం అందించారు. నదుల్లో, జలాశయాల్లో చేపలు వేట సాగించే తమలాంటి మత్స్యకారులకు ఎలాంటి సాయం అందలేదు. కూటమి ప్రభుత్వమైనా మత్స్యకారుల సంక్షేమానికి అండగా నిలవాలి. మత్స్య సంపదకు మంచి మార్కెటింగ్ ఉండేలా చొరవ తీసుకుంటే తమ జీవితాలు బాగుపడే అవకాశం ఉంది.

- రమణయ్య, సంగమేశ్వరం, కొత్తపల్లి మండలం


కృష్ణానదిలో చేప పిల్లలను వదులుతున్న మత్స్యకారులు

మత్స్యకారులకు ఏదీ భరోసా?
పట్టించుకోని కూటమి ప్రభుత్వం

జూపాడుబంగ్లా, నవంబరు 20: శ్రీశైలం జలాశయంలో చేపలు పట్టుకొనే మత్స్యకారులకు భరోసా లేదు. గతంలో టీడీపీ హయంలో చేపలు పట్టుకునేవారికి వల, పుట్టితోపాటు తినడానికి బియ్యం అందించేవారు. మత్స్యకారుడు సొంతంగా చేపలు పట్టి అమ్ముకునేందుకు మోటారుసైకిలు కూడా రాయితీకి ఇచ్చేవారు. సహకార సొసైటీలకు రాయితీతో చేపల పిల్లలను చెరువుల్లో పెంచుకునేందుకు ఇచ్చేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మత్స్యకారులకు అందించే పథకాలన్నీ నిర్వీర్యమయ్యాయని అంటారు. కృష్ణానది పరివాహక రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని వేలాది మంది మత్స్యకారుల బతుకు భారమైంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని తుంగభద్ర, కృష్ణానదుల అనుసంధానంగా ఎన్నో జలాశయాల మీద ఆధారపడి వేలాదిమంది మత్స్యకారులు జీవనోపాధి పొందుతున్నారు. ప్రధానంగా కృష్ణానది పరివాహక ప్రాంతం పగిడ్యాల, నందికొట్కూరు, జూపాడుబంగ్లా, కొత్తపల్లి, పాములపాడు మండలాలతోపాటు దిగువ ఉన్న వెలుగోడు, గోరుకల్లు, అవుకు జలాశయాల్లో వేలాదిమంది మత్స్యకారులు జీవిస్తున్నారు.

చేపల నిల్వ.. మార్కెట్ లేక ఇబ్బందులు



పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సమీపంలో చేపలను నిల్వ చేసుకునేందుకు 30 ఏళ్లకిందట ప్రభుత్వం ఐస్ ప్లాంటు ఏర్పాటు చేసింది. చేపలు చెడిపోకుండా మత్స్యకారులు ఐస్‌లో భద్రపరుచుకుని హైదరాబాదు, కలకత్తా, కర్నూలు తదితర ప్రాంతాలకు ఎగుమతి చేసుకుని లాభాలు గడించేవారు. ఆ ఐస్‌ప్లాంటు కూడా 2000 సంవత్సరం వరకు పనిచేసిన అధికారులు పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. అప్పటినుంచి మత్స్యకారులు ఐస్ కోసం వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. మత్స్యకారులకు సమీపంలో మార్కెట్ వ్యవస్థ కూడా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. చేపలను నిల్వ ఉంచుకోలేక దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సివస్తోంది. అలాగే తంగడంచ విత్తనోత్పత్తి క్షేత్రంలో చేపపిల్లలను చేపపిల్లలను పెంచుకునేందుకు మత్స్యశాఖ అధికారులు సబ్సిడీపై అందించేవారు. ఇది కూడా క్రమంగా ఆగిపోయింది. మత్స్యశాఖ భూములు అన్యాక్రాంతమయ్యాయి.

నదిలో రుచికరమైన చేపలు

సముద్రంలో దొరికే చేపలకన్న కృష్ణానదిలో దొరికే చేపలకు మంచి డిమాండు ఉంది. బొత్స, రవ్వ, మోసు, జీలేబీ, కాకిపరక, బొమ్మడాయలు చేపలు రుచికరంగా ఉండటంతో డిమాండు బాగా ఉంటుంది. దొమ్మ చేప ఆయుర్వేదానికి ఉపయోగపడుంది. దీని రేటు ఇక్కడే కిలో రూ.300పైగా ఉంటుంది. మార్కెట్‌లో మరింత రేటు పలికే అవకాశం ఉంది.

వల విసిరితేనే జీవనోపాధి..



అవుకు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వల విసిరితేనే మత్సకారులకు జీవనోపాధి లభిస్తుంది. అవుకు పట్టణంలో 300 కుటుంబాలకు చెందిన మత్స్యకారులు చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్నారు. రిజర్వాయర్‌లో చేపలను పట్టలేని సమయంలో కొందరు మత్స్యకారులు నీరు పారే కాలువల్లోకి వెళ్లి వల విసిరి చిన్న చిన్న చేపలను పడుతుంటారు. 4.148 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న అవుకు రిజర్వాయర్‌లో చేపలు పెంచుతున్నారు. ఆగస్టు - సెప్టెంబరు నెలల్లో శ్రీశైలం నుంచి కృష్ణా జలాలు రిజర్వాయర్‌కు చేరిన తరువాత ప్రతి ఏటా కైకలూరు, భీమవరం నుంచి చేప పిల్లలను కొని నీటిలో వదులుతున్నారు. ఇందులో రోకు, బంగారుతీగ, గడ్డిచాప, మోస, కట్ల, జిలేబి ఆరు రకాల చేప పిల్లలు ఉంటాయి. చేప పిల్లల సైజును బట్టి రూ. 1 నుంచి 3 వరకు ధర ఉంటుంది. నవంబరు లేదా డిసెంబరు నెలల్లో 30 లక్షలు చేప పిల్లలను ప్రత్యేక వాహనాల్లో తీసుక వచ్చి రిజర్వాయర్‌లో వదలుతారు. ఈ చేప పిల్లలు 5నెలల కాలంలో 1కేజీ వరకు బరువు పెరుగుతాయి. పెరిగిన ఆడ చేపలు గుడ్లు పెట్టినప్పటికీ నీటిలోని జలచరాలు గుడ్లను తింటున్నాయి. దీని వల్ల చేపల సంతానోత్పత్తి పెరగడం లేదు. మత్స్యకారులు టన్ను చేపలు రూ. 1లక్షకు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. వీటిని వ్యాపారులు ఐస్‌బాక్స్‌లో ఉంచి తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుకు తరలిస్తున్నారు.



మత్స్యకారుల దినోత్సవం

వెలుగోడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వెలుగోడు మండలంలో సుమారు 17 టీఎంసీల సామర్థ్యం గల జలాశయం ఉంది. ఈ జలాశయంలో ప్రతిఏటా సుమారు 20 నుండి 30 లక్షల వరకు చేప పిల్లలను విడుదల చేస్తారు.. ఈ చేపల పెంపకంతో మత్స్యకారులకు జీవనోపాధి కలుగుతుంది. జలాశయంలో ప్రతి ఏటా కట్ల, రోహు, ఎర్ర, తెల్లమోసు, కాకి, వాల్గ, తదితర జాతులకు చెందిన చేపలను పెంచుతారు. ఈ చేపలు ఆరకేజి నుండి సుమారు15 కేజీల వరకు బరువు పెరుగుతాయి. ఈ జలాశయం చేపల పెంపకంతో ఆరువందల మంది మత్స్యకారులు లైసెన్సులు పొంది చేపలు పడుతున్నారు. ఈ చేపలను వెలుగోడు నుండి హైదరాబాద్, చెన్నై, కలకత్తా నగరాలకు కూడా మత్స్యకారులు సరఫరా చేస్తారు.

వెలుగోడు జలాశయంలో పట్టిన చేపలు

ఏటా 23 ఎకరాల్లో చేపలను పెంచుతున్నాం



నంద్యాల మండలం అయ్యలూరు గ్రామ సమీపంలో 23 ఎకరాలను మేము లీజుకు తీసుకుని చేపలను పెంచుతున్నాము. చేపల ఉత్పత్తికి మంచి ఆహారం అవసరం ఉంది. కాని అధిక ధరల వల్ల నష్టం వాటిల్లుతోంది. 10 టన్నుల చేపల ఉత్పత్తికి రూ.6లక్షల పెట్టుబడి వస్తోంది. పెట్టుబడి పోను ఆదాయం అంతంత మాత్రమే ఉండడంతో చేపల పెంపకంపై రైతులు దృష్టి సారించడం లేదు. ప్రైవేట్‌గా సాగుచేస్తున్న రైతులకు కూడా ప్రభుత్వ మత్స్యశాఖ నుంచి ఆదరణ లభిస్తే రైతుకు భయం ఉండదు. మేము రూప్‌చంద్ రకం చేపలను ఉత్పత్తి చేస్తున్నాం.

- గోపాలకృష్ణ, మత్స్యకారుడు, నంద్యాల


నంద్యాల ప్రాంతంలో సాగవుతున్న రూప్‌చంద్ రకం చేపలు

మత్స్య సంపద దేశార్థిక ప్రగతికి వెన్నుదన్ను



రాష్ట్రంలో ఇతర జిల్లాలతో పోలిస్తే కర్నూలు జిల్లాలో చేపల పెంపకం అతి తక్కువగా ఉంది. ప్రధాన కారణం జలవనరులు లేకపోవడమే. జిల్లాలో ఈ ఏడాది 37,981 టన్నులు చేపలు, 116 టన్నులు రొయ్యలు ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటి వరకు 16,635 టన్నులు చేపలు, 21 టన్నుల రొయ్యలు ఉత్పత్తి చేశాం. జిల్లా జీవీఏ లక్ష్యం రూ.723 కోట్లు. మత్స్య శాఖ ఫిష్ సీడ్ ఫారాల్లో 70 లక్షల చేప పిల్లలు పెంపకం చేపట్టాం. వివిధ కారణాలు వల్ల పెంపకం దశలోనే కొంత కోల్పోవాల్సి వస్తుంది. శ్రీశైలం జలాశయంలో 51.50 లక్షలు, సుంకేసుల జలాశయంలో 3.50 లక్షల చేప పిల్లలు వదిలేందుకు సన్నహాలు చేస్తున్నాం. మన చెరువు - మన సీడ్ పథకం కింద గాజులదిన్నె సొసైటీ కోటీ, గూడూరు సొసైటీ 60 లక్షలు, సుంకేసుల సొసైటీ ఆధ్వర్యంలో 50 లక్షల చేప గుడ్డు పిల్లలు తెచ్చి పెంచుతున్నాం. నేడు అంతర్జాతీయ మత్స్య దినోత్సవం పురస్కరించుకొని గాజులదిన్నె జలాశయంలో చేప పిల్లలు వదులుతాం. తగిన జాగ్రత్తలతో చేపల పెంపకం చేపడితే లాభదాయంగా ఉంటుంది. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

- రంగనాథ్ బాబు, డీడీ, మత్స్య శాఖ, కర్నూలు

కనీస సౌకర్యాలు మృగ్యం

కర్నూలు జిల్లాలోని గాజులదిన్నె, పందికోన, కృష్ణగిరి, పులికనుమ జలాశయాల్లో చేపల పట్టేందుకు లీజుదారులు మత్స్యకారులను ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాల నుంచే కా కుండా తమిళనాడు నుంచి తీసుకొస్తున్నారు. జలశయాల ఒ డ్డునే చిన్నపాటి గుడారాలు వేసుకొని వేట సాగిస్తున్నారు. అయితే.. కనీస సౌకర్యాలు ఉండడం లేదు. వారికి లైసెన్సు కూడా ఉండదు. దీంతో ప్రమాదాలకు గురైతే మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. సంబంధిత శాఖ అధి కారులు ఇతర ప్రాంతాల నుంచి చేపలు పట్టేందుకు వచ్చే మత్స్యకారులకు స్థానికంగా లైసెన్సులు ఇవ్వడంతో పా టు వారి సంక్షేమానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మార్కెట్ వ్యవస్థ లేదు



కూరగాయలు అమ్ముకోవడానికి రైతులకు రైతుబజార్లు ఉన్నాయి కానీ మత్స్యకారులకు మార్కెట్ వ్యవస్థలేదు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం. శ్రీశైలం జలాశయంలో పట్టుకున్న చేపలను భద్రపరుచుకునేందుకు ఐస్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గతంలో పోతిరె డ్డిపాడు వద్ద ఉండిన ఐస్ ప్లాంటును అధికారులు పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. దాన్ని అధికారులు ఉపయోగంలోకి తీసుకొస్తే బాగుంటుంది.

- సుధాకర్, మత్స్యకారుడు, చాబోలు గ్రామం, జూపాడుబంగ్లా మండలం


కృష్ణమ్మ ఒడిలో చేపల వేట

నందికొట్కూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు నియోజకవర్గంలోని మత్స్యకారులు కృష్ణానది మీద ఆధారపడి జీవిస్తున్నారు. ఉన్నాయి. జనవరి నుంచి జూలై, ఆగస్టు నెలల వరకు జాలర్లు నదిపై ఆధారపడి ఉన్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని నందికొట్కూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా, కొత్తపల్లి మండలాల్లోని శాతనకోట, మల్యాల, నెహ్రూనగర్, ముచ్చుమర్రి, పోతులపాడు, సంగమేశ్వరం, జానాలగూడెం, బలపాలతిప్ప, ఇలా పాతాళగంగ వరకు 100 కి.మీటర్లకు పైగానే కృష్ణా నదిలో చేపల వేట కొనసాగుతోంది. నవంబరు నుంచి కృష్ణానదిలోని నీరు తగ్గుతూ వస్తోంది. ఈ సమయంలో మత్స్యకారులు చేపలు పట్టడం మొదలవుతుంది. ఇలా పట్టిన చేపలను హైదరాబాదు, బెంగళూరులకు తరలిస్తారు.

- సాధారణంగా కృష్ణానదిలో బేర్షలు, బట్టగెండె, పొట్టు, మోసు, నారజల, బొచ్చ, బంగారు తీగ, వివిధ రకాల చేపలు లభిస్తాయి. జూన్‌నెలలో అధికారులు చేప పిల్లలను కూడా నదిలో వదులుతారు. ఈ నదిలో జూన్, జూలై నెలల్లో సుమారు 5 నుంచి 10 కేజీలు ఉండే చేపలు లభిస్తాయి.



ప్రభుత్వం ఆదుకోవాలి



కృష్ణానదిలో ప్రాణాలను పణంగా పెట్టి చేపలు పట్టుకుని జీవిస్తున్నాం. అయినా బతుకుతెరువు కష్టంగా ఉంది. గతంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి ఉన్న సమయంలో మత్స్యకారులను సబ్సిడీలపై మోటారుసైకిల్లు, ఉచితంగా వలలు ఇచ్చారు. ఇప్పుడు కూడా ఇస్తే బాగుంటుంది.

- సురేష్, మత్స్యకారుడు, చాబోలు గ్రామం


వన్య ప్రాణులను వేటాడితే జైలుకే

- ఏడేళ్లు జైలుశిక్ష, జరిమానా
- ముర్తుజావలి, ఫారెస్టు రేంజర్

రుద్రవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నల్లమల జీవ వైవిధ్యంలో వన్యప్రాణులు ఒక భాగం. మానవుల మనుగడలో అడవులు, వన్యప్రాణులు ముఖ్యం. ప్రకృతి వైపరీత్యాలను వన్యప్రాణులు ముందే పసిగడతాయి. రుద్రవరం ఫారెస్టు రేంజ్ 42113.97 హెక్టార్లలో విస్తరించి ఉంది. ఐదు సెక్షన్లు, 14 బీట్‌లు ఉన్నాయి. నల్లమలలోని వన్యప్రాణుల సంరక్షణకు అధికారులు గ్రామసభలు నిర్వహిస్తున్నారు. దండోరా వేసి ప్రజలను చైతన్యపరుస్తున్నారు.

వన్యప్రాణులు ఇలా

వన్యప్రాణులు షెడ్యూలు-1లో పెద్ద పులి, చిరుతపులి, క్రిష్ణ జింక, అడవి జింక, నెమలివంటివి వర్తిస్తాయి. వీటిని వేటాడితే ఏడు సంవత్సరాలు జైలుశిక్ష, రూ.లక్ష నుంచి 50 లక్షల వరకు జరిమానా ఉంటుంది.


నల్లమల అడవులు

షెడ్యూలు 2 ఇలా

కణితి, ఎలుగుబంటి, మోసుడేలి, అడవి పంది, కొండె గొర్రె, జింకారా వన్యప్రాణులు షెడ్యూలు-2లో వర్తిస్తాయి. వీటిని వేటాడితే 3 సంవత్సరాల నుండి ఆపై జైలు శిక్షకు అర్హులవుతారు.

8 నెలల్లో నాలుగు కేసులు నమోదు

రుద్రవరం ఫారెస్టు రేంజ్‌లో 2025 ఏప్రిల్ 6న, జూన్ 29న అడవి పందులను వేటాడిన వారిని కేసు నమోదు చేశారు. 2025 జూలై 27న అహోబిళంలో నాటు తుపాకీ స్వాధీనం చేసుకున్నారు. 2025 నవంబరు 15న అడవి పంది వేటలో నలుగురిపై కేసు నమోదు చేశారు. వీరిలో ఇద్దరిని అరెస్టు చేశారు. ధర్మారెడ్డి, నాగేశ్వర్‌రావు అనే వారు పరారీలో ఉన్నారు.

వన్య ప్రాణులను సంరక్షిస్తాం



వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రజలను చైతన్యపరుస్తున్నాం. ఏప్రిల్ నుంచి నవంబరు వరకు వన్య ప్రాణి చట్టం 1972 కింద నాలుగు కేసులు నమోదు చేశాం. వన్యప్రాణులను వేటాడినా, వాటి చర్మం, గోళ్లు విక్రయించినా జైలుకు వెళతారని ప్రచారం చేస్తున్నాం.

- ముర్తుజావలి, డిప్యూటీ రేంజర్


వన్యప్రాణి సంరక్షణపై అవగాహ కల్పిస్తున్న దృశ్యం

పైపులైన్ నిర్మాణానికి రైతులు సహకరించాలి

- జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్


పూడిచెర్లలో పైపులైన్ స్థలాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్

ఓర్వకల్లు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు తీసుకెళ్తున్న పైపులైన్ నిర్మాణానికి రైతులు సహకరించాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ కోరారు. గురువారం మండలంలోని పూడిచెర్ల గ్రామ సమీపాన వెళ్తున్న పైపులైన్ భూములను ఆయనతో పాటు ఆర్డీవో సందీప్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు జేసీతో మాట్లాడుతూ ఎత్తిపోతల పథకం నుంచి గార్గేయపురం, కేతవరం, పూడిచెర్ల వరకు పైపులైన్ పూర్తయిందని, పూడిచెర్ల వద్ద సారవంతమైన భూములు రైతులు కోల్పోవాల్సి వస్తుందని పూడిచెర్ల గ్రామ మైనార్టీ కాలనీ నుంచి కొండపై చెరువు కట్ట వరకు పైపులైన్ తీసుకెళితే రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని జేసీకి రైతులు తెల్పి చెప్పారు. అయితే.. కొండపై నీరు ఎక్కేందుకు ఇబ్బందిగా ఉంటుందని, గతంలో వేసిన ప్రకారమే పైపులైన్ వేస్తామని అధికారులు తెల్పి చెప్పారు. పైపులైన్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు రూ.12.50 లక్షలు మంజూరు చేశామని, అయితే.. రైతులు నష్టపరిహారాన్ని తిరస్కరిస్తున్నారనీ తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వో, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఏపీఐఐసీలో భూములు కోల్పోయిన బ్రాహ్మణపల్లె, కన్నమడకల, పూడిచెర్ల, ఓర్వకల్లు, గుట్టపాడు, ఎన్. కొంతలపాడు, మీదివేముల, ఉప్పలపాడు, సోమయాజులపల్లె, పాలకొలను, కొమరోలు గ్రామాల్లో భూములు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో ఈ నెల 27లోపు పూర్తి చేయాలని జేసీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విద్యాసాగర్, డిటీ సతీష్ కుమార్, సర్వేయర్ శంకర్ మాణిక్యం, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సివిల్స్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వాసులై ఉండి డిగ్రీ పూర్తి చేసిన ఎస్టీ కులానికి చెందిన వారు అర్హులు అన్నారు. ఆసక్తి గలిగిన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు రెండు ఫొటోలు, విద్య, కుల, ఆదాయ ధృవీకరణ పత్రం, ఆధార్, పాన్‌కార్డు తదితర జిరాక్స్ కాపీలను జతపరిచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించాలన్నారు. గిరిజన విద్యార్థులకు విజయవాడలో 40, తిరుపతిలో 40, విశాఖపట్టణం 20 కేంద్రాల్లో కలిపి మొత్తం 100 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. కుటుంబ సంవత్సర ఆదాయం రూ.8లక్షల లోపు ఉండాలన్నారు. రెగ్యులర్ డిగ్రీ అర్హత తప్పనిసరి అన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులను సమర్పించేందుకు ఈ నెల 26వ తేదీ చివరి గడువు అన్నారు. ఈ నెల 27 నుంచి హాల్ టికెట్లను డౌన్ లోడు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 30న దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్క్రీనింగ్ పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు డిసెంబరు 10వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం అవుతాయని సురేష్ పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన గిరిజన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా తెగల షెడ్యూల్ సంక్షేమ సాధికారిత అధికారి సురేష్ తెలిపారు.

23న అండర్-12 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

కర్నూలు న్యూసిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్వర్యంలో జరిగే సౌత్ జోన్ అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంటులో పాల్గొనే అండర్-12 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి దేవేందర్‌గౌడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు డీఎస్‌ఏ స్టేడియంలోని కర్నూలు క్రికెట్ అసోసియేషన్ నెట్స్‌లో ఎంపిక జరుగుతుందన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు పాల్గొనాలని ఆయన కోరారు. 1-9-2013 తరువాత జన్మించిన వారు ఎంపికకు అర్హులన్నారు. ఒరిజినల్ జనన ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డుతో ఎంపికకు రావాలన్నారు.

సచివాలయ పర్యవేక్షణ అధికారుల నియామకం

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సచివాలయాలకు పర్యవేక్షణ అధికారులను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరికి డిప్యూటీ ఎంపీడీవో స్కేల్‌ను కేటాయిస్తూ డిప్యుటేషన్‌పై పని చేయనున్నారు. ఈ మేరకు గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు, సీనియర్ అసిస్టెంట్లు కర్నూలు జిల్లాలో 25 మంది, నంద్యాల జిల్లాలో 28 మంది లబ్ధి పొందనున్నారు. మండల స్థాయిలోనే వీరు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. కాగా వీరిని మండల జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారిగా పరిగణిస్తారు.

పరిశ్రమల స్థాపనకు అనుమతులు

• కలెక్టర్ సిరి



కర్నూలు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపనకు వీలుగా ఆయా శాఖలు నిర్దేశించిన గడువులోపు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్‌పర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులకు గడువులోపు అనుమతులను మంజూరు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద లబ్ధిదారులను త్వరితగతిన రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎల్డీఎంను ఆదేశించారు.

● 9.72 లక్షలకు ఆమోదం: పరిశ్రమలకు ప్రోత్సాహకాల్లో భాగంగా క్లయిమ్‌లకు రూ.9.72 లక్షలకు ఆమోదం తెలిపామని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా పెట్టుబడి రాయితీ కింద ఒక క్లెయిమ్‌కు రూ.5,29,398, పవర్ కాస్ట్ రియంబర్స్‌మెంటు కింద ఒక క్లయిమ్‌కు రూ.66,257, సేల్స్ ట్యాక్స్ రీయంబర్స్‌మెంటు కింద ఒక క్లెయిమ్‌కు రూ.3,77,186, పారిశ్రామిక ప్రోత్సాహకాల కింద ఆమోదం తెలిపామన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం అశోక్ కుమార్, పరిశ్రమల శాఖ డీడీ జవహర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రిడిటేషన్లకు దరఖాస్తు చేసుకోండి

• సమాచార శాఖ డీడీ జయమ్మ

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్రిడిటేషన్లకు దరఖాస్తు చేసుకోవాలని సమాచారశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.జయమ్మ సూచించారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. జర్నలిస్టులు mediarealtions.ap.gov.in వెబ్‌సైట్‌లో వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అక్రిడిటేషన్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నాక జర్నలిస్టులు తాము పని చేస్తున్న సంస్థ వివరాలు ఇచ్చి దరఖాస్తు సబ్‌మిట్ చేయవచ్చున్నారు. అదేవిధంగా జిల్లా నుంచి ప్రచురితం అవుతున్న దినపత్రికలు, పీరియాడికల్స్ కేబుల్ చానల్స్ సంస్థల వివరాలు పోర్టల్‌లో పొందుపరిచిన అనంతరమే దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. దినపత్రికలు, పీరియాడికల్స్, కేబుల్ టీవీ యాజామాన్యాలు సంబంధిత పత్రాల డాక్యుమెంట్లను పెన్‌డ్రైవ్‌లో పొందుపరిచి ఒక సెట్ ఫొటోస్టాట్‌ను కలెక్టరేట్‌లోని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

కర్నూలు రూరల్ నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో అప్రెంటిషిప్ చేసేందుకు దరఖాస్తు చేసుకున్న ఐటీఐ అభ్యర్థులకు వచ్చే నెల 5వ తేదీన సర్టిఫికెట్లు పరిశీలన చేయనున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ కర్నూలు జోనల్ సిబ్బంది కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. నజీర్ అహమ్మద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 25నుంచి ఈనెల 8వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే సర్టిఫికెట్ల పరిశీలనకు రావాలని ఆయన సూచించారు. అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతోపాటు ఆధార్ కార్డు, పాస్ ఫొటోలు, కుల, ఆదాయ సర్టిఫికెట్లు కూడ వెంట తెచ్చుకోవాలని వివరించారు. ఐటీఐలో డిజిల్ మెకానిక్ ట్రేడ్ అభ్యర్థులకు వచ్చే నెల 5వ తేదీన ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు.

భవనాశి నీటిలో జారిపడి రైతు మృతి



రామసుబ్బయ్య(ఫైల్)

చాగలమర్రి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నగల్లపాడు గ్రామ సమీపంలోగల భవనాశి నీటిలో ప్రమాదవశాత్తు జారిపడి రైతు మూరబోయిన రామసుబ్బయ్య (60) గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడు తనకున్న గేదెలను మేపుకునేందుకు పొలానికి వెళ్లాడు. తిరిగి గేదెలను ఇంటికి తీసుకొస్తుం డగా భవనాశి నీటిలోకి గేదెలు దిగడంతో వాటిని తోలేందుకు వెళ్లి నీటి గుంతలో ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. గేదెలు ఇంటికి వచ్చిన రామసుబ్బయ్య రాకపోవడంతో భార్య, కుటుంబీకులు భవనాశి వద్ద ప్రవహిస్తున్న నీటి వద్దకు వెళ్లి గాలింపు చేశారు. కనిపించక పోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎస్ఐ సురేష్, పోలీసులు భవనాశి నది వద్దకు వెళ్లి నీటిలో గాలింపు చేయగా మృతదేహం బయటపడింది. నీటిలో ఉన్న మృతదేహాన్ని బయటకు తీశారు. గేదెలు మేపుకునేందుకు వెళ్లి మృత్యువాత పడటంతో భార్య, కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి

కర్నూలు క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదానికి గురైన జయకృష్ణ అనే యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. శివరాంపురం గ్రామానికి చెందిన జయకృష్ణ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 18న తన మిత్రుడ్ని గార్గేయపురం వెళ్లి వదిలి తిరిగి వెళ్తుండగా.. ఆటో బోల్తా పడి గాయాలయ్యాయి. గాయపడిన జయకృష్ణను చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించగా కోలుకోలేక మృతి చెందాడు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

కోవెలకుంట్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎల్‌యం కాంపౌడుకు చెందిన రంగస్వామి(21) అనే యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. పట్టణంలోని ఎల్‌యం కాంపౌడుకు చెందిన రామారావు కుమారుడు రంగస్వామి గడేకారి పనిచేస్తూ జీవనం సాగించేవాడు. గురువారం పనికి వెళ్లి ఇంటికి వచ్చి ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వెలుగోడులో చోరీ

వెలుగోడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్‌లో గురువారం తెల్లవారుఝామున భారీ చోరీ జరిగింది. కాలనీకి చెందిన సిద్ధయ్య క్రాంతి నగర్‌లో నివసిస్తున్నాడు.. ఆయన వెలుగోడులోని పొట్టి శ్రీరాములు సెంటర్‌లో పానీపూరి వ్యాపరం చేస్తున్నాడు. ఆయన ఇంటి నుంచి వ్యాపారానికి వెళ్లిన సమయంలో దొంగలు ఇంట్లోకి ప్రవేశించి ఇంటిలోని బీరువాను పగులగొట్టి రూ.60 వేలు నగదు.. 24 గ్రాముల బంగారం, ఒక సెల్‌ఫోన్ దొంగిలించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశారు. క్లూస్ టీమ్‌ను రప్పించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేశ్ తెలిపారు.

బాలికను వేధించిన వ్యక్తిపై కేసు

శ్రీశైలం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న వ్యక్తిపై పోలీసులు వేధింపుల కేసు నమోదు చేశారు. శ్రీశైలం 1వ పట్టణ సీఐ ప్రసాదరావు తెలిపిన వివరాలివీ.. మేకలబండకు చెందిన బాలికను కొంత కాలంగా రాజు ప్రకాష్ రెడ్డి లైంగికంగా వేధిస్తున్నాడని బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. విచారించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

జిల్లా జైలు తనిఖీ



భోజనం రుచి చూస్తున్న లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచలింగాలలోని జిల్లా జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన జైలులో నిర్వహిస్తున్న లీగల్ ఎయిడ్ క్లీనిక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లో ఒక న్యాయవాదితో పాటు పారా లీగల్ వలంటీర్ సభ్యులుగా ఉంటారనీ, వారు ఖైదీలకు ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తారనీ తెలిపారు. జైలులో ఉన్న ఖైదీలు సత్ప్రవర్తనతో తమ శిక్షా కాలాన్ని పూర్తి చేసుకోవాలని సూచించారు. ఖైదీలకు అవసరమైన న్యాయ సహాయాన్ని తాము ఉచితంగా అందజేస్తామని, అనారోగ్యం, 70 ఏళ్ల వయస్సు దాటిన ఖైదీలకు బెయిల్ మంజూరయ్యేందుకు తాము కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు లీగల్ ఎయిడ్ న్యాయవాది శివరాం తదితరులు పాల్గొన్నారు.

మమతా నగర్‌లో చోరీ

కర్నూలు క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో మమతా నగర్‌లో మునిస్వామి అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. మునిస్వామి ఈ నెల 17వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి ఊరు వెళ్లాడు. తిరిగి వచ్చి చూస్తే ఇంట్లో ఉన్న తులం బంగారు ఆభరణాలు, రూ.40వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హెడ్ కానిస్టేబుళ్లకు పదోన్నతి

కర్నూలు క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నలుగురు హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా పదోన్నతి కల్పిస్తూ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. సి.నాగన్న (జూపాడుబంగ్లా పీఎస్), హనీఫ్ (కే.నాగులాపురం పీఎస్), మద్దిలేటి (కర్నూలు త్రీటౌన్ పీఎస్), మీరాసాహేబ్(కోవెలకుంట్ల పీఎస్) పదోన్నతి పొందిన వారిలో ఉన్నారు.

సమగ్ర శిక్ష ప్రాజెక్టు కో ఆర్డినేటర్‌గా డాక్టర్ ఎన్‌వీ లోక్‌రాజ్

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్‌గా డాక్టర్ ఎన్‌వీ లోక్‌రాజ్‌ను నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. డోన్ జీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్న ఎన్‌వీ లోక్‌రాజ్‌ను డిప్యుటేషన్‌పై నియమించారు. ప్రస్తుతం డీఈవో శామ్యూల్ పాల్ ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు.

మట్టి టిప్పర్ సీజ్

మహానంది, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను మైనింగ్ శాఖ అధికారులు సీజ్ చేశారు. అడవిలోని సర్వనరసింహస్వామి ఆలయం సమీపంలో ఉన్న వాగులో నుంచి రైల్వే డబల్ ట్రాక్ అభివృద్ధి పనుల కోసం గురువారం కొందరు కాంట్రాక్టర్లు ఎక్స్‌కవేటర్ సాయంతో తవ్వి టిప్పర్‌తో అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం అందింది. మహానంది మండలం బోయలకుంట్ల మెట్ట వద్ద టిప్పర్‌ను స్వాధీనం చేసుకొన్నారు. టిప్పర్‌ను మహానంది పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

తలసేమియా బాధితుల కోసం...

• రక్తదానం చేసిన హీరో మంచు మనోజ్



రక్తదానం చేస్తున్న హీరో మంచు మనోజ్



సమావేశంలో మాట్లాడుతున్న మంచు మనోజ్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని సినీ నటుడు మంచు మనోజ్ పిలుపునిచ్చారు. నందమూరి బాలకృష్ణ, మోక్షజ్ఞ ఆర్గనైజేషన్ కర్నూలు ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్‌లో తలసేమియా చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సిని నటుడు మంచు మనోజ్, ఆయన భార్య భూమా మౌనిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా తలసేమియా బాధితుల కోసం మంచు మనోజ్ రక్తదానం చేశారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంచు మనోజ్ మాట్లాడారు. తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిబిరంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. తలసేమియా వ్యాధిని తెలుసుకునేందుకు గర్భిణులు, జన్యుపరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని నందమూరి బాలకృష్ణ అభిమానులు, మోక్షజ్ఞ ఆర్గనైజేషన్ మరిన్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని అవగాహన కల్పించేలా పోస్టర్లను ఆవిష్కరించారు. రక్తదాన శిబిరంలో 85 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ కె.అరుణ, కోశాధికారి నరసింహ, కమిటీ సభ్యులు జి.శ్రీనివాసులు యాదవ్, కేవీ సుబ్బారెడ్డి, భీమా శంకర్ రెడ్డి, మోక్షజ్ఞ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ఎస్.మోతిలాల్, కన్వీనర్ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిరప పంటకు గడ్డి మందు పిచికారీ

• రూ.10 లక్షల పంట నష్టం • ఇద్దరిపై కేసు నమోదు



ఎండిపోయిన మిరప పంటను చూపిస్తున్న రైతు దంపతులు

మంత్రాలయం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మిరప పంట బాగా దిగుబడి వచ్చిందనన్న కక్షతో తమ్ముడి మిరప పంటకు గడ్డి మందు కొట్టి అన్న, అన్న కొడుకులు నాశనం చేశాడు. మంత్రాలయం మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన పింజరి మాబు సాబ్, దస్తగిరమ్మకు రెండెకరాల పొలం ఉంది. ఒక ఎకరాలో పత్తి వేయగా.. మరో ఎకర పచ్చి మిరప 2043 గాడిగరకం మిర్చి పంటను సాగు చేశాడు. అయితే.. పంట గ్రామంలోనే అధిక దిగుబడి రావడం చూసి ఓర్వలేక అన్న అబ్దుల్, కుమారుడు రెహిమాన్ రాత్రికిరాత్రి గడ్డి మందు పిచికారీ చేశారు. దంతో పంట ఎండిపోయి మిరపకాయలు రాలిపోయి మచ్చలు ఏర్పడ్డాయి. ఈనెల 12న పిచికారీ చేయగా.. 13వ తేదీ మధ్యాహ్నం నాటికి మిరప పంట మచ్చలు సోకి ఎండిపోయింది. ఇది గమనించిన రైతు పిచికారీ మందు యజమానికి సమాచారం ఇచ్చారు. కంపెనీ అధికారులు పొలాన్ని చూసి అదే మందును కురువ మహదేవ, జూట వీరనాగుడు, బూదూరు గ్రామంలో పిచికారీ చేశారు. తన పక్క పొలంలోనే ఉన్న అన్న కొడుకు ఈ పని చేశారని గుర్తించి గురువారం మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌లో బాధిత రైతు దంపతులు ఫిర్యాదు చేశారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అన్న పింజరి అబ్దుల్, రెహిమాన్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నారు. చేతికొచ్చిన పంటను ఓర్వలేక సొంత అనే రూ.10 లక్షల పంటను నాశనం చేయడం.. తమ్ముడు జీర్ణించుకోలేకపోయాడు. దాదాపు రూ.5 లక్షలు అపులు చేసి ఈ ఏడాదైనా అప్పులు తీరుతాయనుకుంటే అన్నే తమ్మునికి ఇంత నష్టం కలిగించడం చర్చనీయాంశంగ మారింది.

ప్రాణం పోసిన వైద్యులు

• కర్నూలు జీజీహెచ్‌లో అరుదైన ఆపరేషన్



రోగితో డాక్టర్ మంజులాబాయి, వైద్యులు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా కదిరికి చెందిన ఓ రోగికి కర్నూలు జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ వైద్యులు ప్రాణం పోశారు. కదిరికి చెందిన 54 ఏళ్ల ఏసన్న గుండెలో మూడు వాల్వ్‌లు బ్లాక్ కావడంతో సెప్టెంబరులో అనంతపురంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చేరారు. వైద్యులు ఓపెన్ హార్ట్ సర్జరీ చేశారు. ఇంటికి వచ్చిన తర్వాత కుట్లు వేసిన చోట రక్తం, చీము కారడంతో మళ్లీ ఆపరేషన్ చేయించుకున్న ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లగా బెంగుళూరుకు రెఫర్ చేశారు. బెంగుళూరులోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో అడ్మిట్ కాగా రూ.10 లక్షలు ఖర్చు అయింది. అయిన ఇన్‌ఫెక్షన్ తగ్గకపోవడం ఓ వైద్యుని సూచనల మేరకు గత నెల 29వ తేదీన రోగిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి తీసుకుని వచ్చారు. హెచ్‌వోడీ డా.మంజులాబాయి రోగిని పరీక్షించి అడ్మిషన్ చేసుకుని ఈ కేసును చాలెంజ్‌గా తీసుకున్నారు. ఈ నెల 8వ తేదీన ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌వోడీ డా.మంజులాబాయి అసోసియేట్ ప్రొఫెసర్ డా.గంగాభావని, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.సింధూ ప్రియాంక, డా.విజయ చంద్రమౌళి బృందం క్లిష్టమైన కేసును విజయవంతంగా నిర్వహించారు. వారం రోజులకు ఇన్‌ఫెక్షన్ తగ్గడంతో డిశ్చార్జ్ అయ్యారు. గురువారం సర్జరీ వివరాలను డా. మంజులాబాయి వివరించారు.

రైతులకు నోటీసులు

మహానంది, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన ఆరుగురు రైతులకు నోటీసులు అందచేసినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మహానంది నుం,ఇ ఎంసీ ఫారం మీదుగా గాజులపల్లికి వెళ్లే మార్గంలోని ప్రధాన రహదారిపై గోపవరానికి చెందిన ఆరుగురు రైతులు మొక్కజొన్న సీడ్‌ను ఆరబెట్టుకోవడం వల్ల తరుచూ వాహనాదారులు ప్రమాదానికి గురవుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. ఇందులో భాగంగా ఆరబోసిన మొక్కజొన్న పంటను తొలగించాలని నోటీసులు ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

బైకు చోరీ

మహానంది, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుక్కాపురం గ్రామంలో బైక్ చోరికి గురైనట్లు బాధితుడు నల్లబోతుల శ్రీనివాసులు బుధవారం తెలిపారు. మంగళవారం రాత్రి ఇంటిముందు ఉంచి ఉన్న బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

రైతుల ప్రయోజనమే లక్ష్యం

• రీజనల్ మేనేజర్ నాగరాజు



గోదాము వద్ద కాటాను పరిశీలిస్తున్న ఆర్ఎం

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గిడ్డంగుల సంస్థ (ఎస్‌డబ్ల్యూసీ)ను బలోపేతం చేయడంతో పాటు రైతులకు ప్రయోజనం కల్పించడమే లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని ఆ సంస్థ రీజనల్ మేనేజర్ నాగరాజు తెలిపారు. గురువారం కడప నుంచి కర్నూలు వచ్చిన ఆయన కర్నూలు నగరంలోని రేడియోస్టేషన్ వద్ద ఉన్న ఎస్‌డబ్ల్యూసీ గోదాములను పరిశీలించారు. గత నాలుగేళ్లుగా ఎటువంటి వినియోగం లేకుండా ఉన్న ఈ గోదాములకు పౌర సరఫరాల సంస్థకు సంబంధించిన 6వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని నిల్వ చేసేందుకు సంస్థ ఎండీ నవ్య, చైర్మన్ వెంకటేశ్వరరావు చర్యలు తీసున్నారు. ఈ గోదాములకు బియ్యం రైల్వే రేకు పాయింట్ నుంచి వస్తుండడంతో గోదాములను పరిశీలించేందుకు వచ్చామనీ ఆర్ఎం సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా లారీలను నిల్వ చేసేందుకు, అదే విధంగా తూకం వేసేందుకు ఏర్పాటు చేసిన వేయింగ్ కాటాను పరిశీలించారు. ఆర్ఎం విలేకరులతో మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా రాయలసీమలోని ఎస్‌డబ్ల్యూసీ గోదాముల్లో ఆహార ఉత్పత్తుల నిల్వలు లేక నిరుపయోగంగా ఉన్నాయని, ప్రస్తుతం ఆ గోదాములన్నింటిలో పౌరసరఫరాల సంస్థకు చెందిన బియ్యంతో పాటు రైతుల నుంచి సేకరించిన ఆహార ఉత్పత్తులను నిల్వ చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. కర్నూలు, కడప, అనంతపురం ఉమ్మడి జిల్లాలో 1,12,789 మెట్రిక్ టన్నుల ఆహార ఉత్పత్తులను నిల్వ చేసే సామర్థ్యం నిల్వ ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఈ గోదాముల్లో పూర్తి స్థాయిలో ఆహార ఉత్పత్తులను నిల్వ ఉంచేలా ఎస్‌డబ్ల్యూసీ ఎండీ, చైర్మన్ వైస్, చైర్మన్ ఆదేశించారని చెప్పారు. ఇందులో భాగంగానే సంస్థ గోదాములను ఏవేవి నిరుపయోగంగా ఉన్నాయో గుర్తించి వాటిల్లో సివిల్ సప్లయ్ చెందిన బియ్యంతో పాటు రైతుల నుంచి సేకరించిన ఆహార ఉత్పత్తులను నిల్వ చేసేందుకు త్వరితగతిన చర్యలు చేపడుతున్నామని ఆర్ఎం చెప్పారు. నంద్యాలలో 9వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సంస్థ గోదాముల్లో నిల్వ చేసేందుకు చర్యలు తీసుకున్నామని, అదే విదంగా డోన్‌లో రైతులకు సంబందించిన 2వేల మెట్రిక్ టన్నుల కందులను నిల్వ చేశామని, నాలుగేళ్లుగా నిరూపయోగలో ఉన్న కర్నూలు నగరంలోని రేడియోస్టేషన్ వద్ద ఉన్న ఎస్‌డబ్ల్యూసీ గోదాముల్లో 6వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని నిల్వ చేస్తున్నామని తెలిపారు. కర్నూలు నగరంలోని ఇందిరాగాంధీనగర్ వద్ద ఉన్న గోదాములను పూర్తిస్థాయిలో ఆధునికీకరించి సంసకు ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకునే ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

• యువతకు మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ పిలుపు
• ముగిసిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



టీజీ వెంకటేశ్, ప్రముఖులతో విద్యార్థులు

కర్నూలు కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విజ్ఞానానికి నిలయాలైన గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ యువతకు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వారం రోజులుగా కొనసాగుతున్న 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం వైభవంగా ముగిశాయి. ముగింపు వేడుకలు, బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా టీజీ వెంకటేశ్ హాజరయ్యారు. జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ ఆనాటి జాతీయ నేతలు ముందుచూపుతో యువతకు విద్యతోపాటూ విజ్ఞానాన్ని అందించేందుకు గ్రంథాలయాలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. మారుతున్న కాలానుగుణంగా గ్రంథాలయాల్లో అవసరమైన పుస్తకాలతోపాటూ, నేటి యువతకు పోటీ పరీక్షలకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు కలిగి ఉన్నాయని చెప్పారు. తాను పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా ఉన్నప్పుడు గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలిపారు. గ్రంథాలయాల అభివృద్ధికి ప్రజల నుంచీ వచ్చే పన్నులతోనే కాకుండా ప్రభుత్వాలు కూడా ప్రత్యేక నిధులు కేటాయించి వాటి అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇదిలా ఉండగా వారం రోజులుగా వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు టీజీ వెంకటేశ్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి, విద్యాసంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్లు కేసీ కల్కూర, కేజీ గంగాధరరెడ్డి తదితరులు ప్రసంగించారు. అనంతరం అతిథులను గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి వి.పెద్దక్క ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, ఎస్.బాషా, మక్బుల్ బాషా, నసీమా బీ, రేణుక, పద్మావతమ్మ, ఈశ్వరమ్మ, నాగభాస్కర్, ఉమ తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మం పవిత్రమైనది : వీహెచ్‌పీ



సమావేశమైన వీహెచ్‌పీ సభ్యులు

శ్రీశైలం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మానవజాతి మనుగడలో ప్రధాన పాత్ర పోషించే హైందవ సనాతన ధర్మం ఎంతో పవిత్రమైనదని నంద్యాల జిల్లా విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి అన్నారు. గురువారం సున్నిపెంట బ్రహ్మంగారి దేవాలయ ప్రాంగణంలో వీహెచ్‌పీ ప్రతినిధులు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ శ్రీశైల క్షేత్ర పరిధిలోని గిరిజన తండాలు, ఎస్సీఎస్టీ కాలనీలో నివసించే వారిని బలవంతపు మత మార్పిడి జరగకుండా అడ్డుకోవడంతో పాటు హిందూధర్మంపై అవగాహన కల్పించడమే వీహెచ్‌పీ లక్ష్యమన్నారు. కొంత కాలంగా హిందూ కుటుంబాలను కొందరు ప్రలోభపెడుతూ మతమార్పిడికి పాల్పడుతున్నారన్నారు. వీటిని హైందవులు అడ్డుకోవాలన్నారు. ఈ సమావేశంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి కిషోర్ కుమార్, లీగల్‌సెల్ కన్వీనర్ గిరిధర్‌బాబు, దూరదర్శన్ సబ్‌ఎడిటర్ రాజుస్వామి, అరవింద్, గెల్లి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

నాగేశ్వరస్వామి దేవాలయంలో లక్ష బిల్వార్చన


పూజల్లో పాల్గొన్న భక్తులు

పగిడ్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా తూర్పు ప్రాతకోట గ్రామంలోని శ్రీనాగేశ్వరస్వామి దేవాలయంలో లక్ష బిల్వార్చన నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి దేవత మూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కల్యాణం నిర్వహించారు. భక్తులు బిల్వఆకును సమర్పించి శివలింగానికి పూజలు చేశారు. దేవాలయ ఆవరణం శివనామ స్మరణతో హోరెత్తింది. కార్యక్రమానికి హంబ్లీ పీఠాధిపతి విరుపాక్ష స్వామి హాజరై కార్తీకమాసం విశిష్టతను భక్తులకు తెలియజేశారు. కార్యక్రమంలో నందికొట్కూరు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, శంకర్‌రెడ్డి, మోక్షేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం


పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

నంద్యాల కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీక అమావాస్య సందర్భంగా పట్టణంలోని బైరమల్‌వీధిలోని బసవేశ్వరస్వామి ఆలయంలో గురువారం పార్వతీపరమేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు శశిభూషణ్ సిద్ధాంతి, ఆలయ ధర్మకర్తలు అమర్నాథ్, శివానంద ప్రసాద్ ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఆలయంలో బసవేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఝాన్సీ లక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బైరెడ్డి శబరి

గడివేముల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీ బైరెడ్డి శబరి విద్యార్థినులకు సూచించారు. మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి హైస్కూల్‌లో ఆంధ్ర విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలకు గురువారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రాజరాజేశ్వరి హైస్కూల్ కరస్పాండెంట్ రామేశ్వరరావు, ఏవో ఎంబీఎస్ రాఘవేంద్రరావు, ఆంధ్రవిద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నంద్యాల జిల్లా అధ్యక్షులు నాగరాజు పాల్గొన్నారు.

వాహనం అందజేత

నంద్యాల టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయానికి తన నిధులతో ఎంపీ బైరెడ్డి శబరి బొలెరో వాహనం అందజేశారు. గురువారం కార్యాలయంలో ఎస్పీ సునీల్ షెరాన్‌తో కలిసి ఎంపీ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ శాంతి భద్రతల నిర్వహణకు వాహనం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

నంద్యాల టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని నంద్యాల ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి సూచించారు. గురువారం స్థానిక డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శశికళ, ఈగల్ క్లబ్ కన్వీనర్ వెంకటేశ్వర్‌రెడ్డి, కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి జీవనోపాధి ఉండాలి

పాణ్యం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రతి కుటుంబం జీవనోపాధి కలిగి ఉండాలని డీఆర్డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం పాణ్యంలో పీఎంఈజీపీ పథకం ద్వారా రూ. 4.30 లక్షల బ్యాంకు రుణంతో మంజూరు చేసిన కంప్యూటర్ ఎంబ్రాయిడరీ షాపును పీడీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు సుస్థిర ఆదాయం పొందాలన్నదే ధ్యేయమన్నారు. మహిళలకు ఆసక్తి గల రంగాలలో శిక్షణ ఇప్పించి కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీజీబీ మేనేజరు సురేష్‌కుమార్ రెడ్డి, ఏపీఎం ప్రసాదు, మండల సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

'రైతన్నల పోరు'ను జయప్రదం చేయాలి

ఆత్మకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నంద్యాలలో ఈనెల 26న నిర్వహించనున్న రైతన్నల పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయా ప్రజా సంఘాల నాయకులు రాజశేఖర్, ఏసురత్నం, నరసింహానాయక్, స్వాములు కోరారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఐదేళ్ల క్రితం 380 రోజుల పాటు అన్నదాతలు సుదీర్ఘ పోరాటం చేయడంతో ప్రజావ్యతిరేక వ్యవసాయ చట్టాలను రద్దు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం 11ఏళ్లలో రూ.16.14లక్షల కోట్ల రుణాన్ని కార్పొరేట్ శక్తులకు మాఫీ చేసిందని, అయితే రైతులకు ఒక్కరూపాయి కూడా రుణమాఫీ చేయలేదని అన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం చేపడుతున్న రైతు పోరును జయప్రదం చేయాలని కోరారు.

ప్రపంచవ్యాప్తమైన శ్రీశైల వైభవం


శ్రీశైలం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైల క్షేత్ర వైభవం..స్వామిఅమ్మవార్ల దర్శన భాగ్యం కార్తీ మాస చివరిరోజు కలుగడం ఎంతో ఆనందంగా ఉందని రష్యా దేశానికి చెందిన మహిళా భక్తులు అన్నారు. గురువారం క్షేత్రానికి వచ్చిన వారు స్వామివారి మహామృత్యుంజయ హోమంలో పాల్గొని స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న పరివార దేవతలను దర్శించుకున్న వారికి టీడీపీ మండల ఇన్‌చార్జి యుగేంధర్‌రెడ్డి క్షేత్రవిశేషాలను వివరించారు. రష్యా భక్తుల వెంట మండల అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, రమణ, మణికంఠ, శంకర్, ఆంజనేయులు ఉన్నారు.

రైతుల అభ్యున్నతికి సహకార సంఘాల తోడ్పాటు అవసరం

నంద్యాల రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతికి సహకార సంఘాల తోడ్పాటు ఎంతో అవసరమని జిల్లా వ్య వసాయ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం సహకార వారోత్సవాల ముగింపు కార్యక్రమం బొమ్మలసత్రంలోని జిల్లా మార్క్‌ఫెడ్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ జిల్లా అధికారి హరినాథ్‌రెడ్డి, వ్యవసాయ అధికారులు, డీసీఎంఎస్ సిబ్బంది, సహకారసిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన కార్తీక మాసోత్సవాలు

- చివరి రోజు ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు
- దీపాలు వెలిగించిన మహిళలు


శ్రీశైలం ఆలయ ప్రధాన ధ్వజస్తంభంపై వెలుగుతున్న ఆకాశదీపం


ప్రత్యేక అలంకరణలో రుద్రకోటేశ్వరుడు


రుద్ర కోటీశ్వరాలయ ప్రాంగణలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

శ్రీశైలం/ఆత్మకూరురూరల్/నంద్యాల కల్చరల్/కొత్తపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆలయాల్లో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించిన కార్తీక మాసోత్సవాలు వైభవోపేతంగా ముగిశాయి. నెలరోజుల పాటు మహిళలు ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గురువారం చివరి రోజు కావడంతో ఆలయాల్లో భక్తుల రద్దీ కనిపించింది. ఆలయాల ప్రాంగణంలో దీపాలను వెలిగించారు. మొక్కులు తీర్చుకున్నారు. శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబికా దేవిని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. సకల శుభాలకు ఆకాశ దీపం సంకేతమని శ్రీశైలం ఈవో శ్రీనివాసరావు అన్నారు. నల్లమల అభయారణ్యంలో వెలసిన రుద్రకోటేశ్వరాలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ప్రత్యేకించి నంద్యాల, కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ పురోహితులు లక్ష్మి చెన్న కేశవ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు గావించారు. కొత్తపల్లి మండలంలోని కృష్ణానది ఒడ్డున ఉన్న సప్తనదుల సంగమేశ్వరంలో ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ ఆధ్వర్యంలో గురువారం కార్తీక మాస ముగింపు పూజలు ఘనంగా నిర్వహించారు. అలాగే కొలనుభారతి అమ్మవారి క్షేత్రంలోని సప్తశివాలయాల్లోనూ మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. నంద్యాల కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో చంద్రశేఖరస్వామికి వైభవంగా అన్నం రాశిగా పోసి పరమపవిత్రంగా అన్నాభిషేక మహోత్సవం నిర్వహించారు. స్వామి వారి పూజ అనంతరం భక్తులకు ప్రసాదం పంచిపెట్టారు. అలాగే పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ అమ్మస్ఫటిక లింగేశ్వరాలయంలో ఆకాశదీపోత్సవం నిర్వహించారు. అమ్మ స్ఫటికలింగేశ్వరునికి రుద్రాభిషేకం, పంచామృత అభిషేకాలు పూజలు నిర్వహించారు.


నంద్యాలలో చంద్రశేఖరస్వామికి అన్నాభిషేకం


దీపాలు వెలిగిస్తున్న భక్తులు


సంగమేశ్వరంలో ఉమామహేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న పురోహితుడు తెలకపల్లి రఘురామశర్మ


అమ్మస్ఫటిక లింగేశ్వరాలయంలో ఆకాశ దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్


వసతి గృహాన్ని పరిశీలించి వస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటిని పరిష్కారం కోసం ఈకార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారంలో ఎటువంటి జాప్యం జరగకుండా చూడాలని ఆదేశించారు. నియోజకవర్గంలో మెరుగైన సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు , నాయకులు పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయండి

వసతి గృహం నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆదేశించారు. గురువారం పట్టణ శివారులో నిర్మాణంలో ఉన్న ఉర్దూ బాల, బాలికల వసతి గృహాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం వాటి పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీ విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నాణ్యతతో పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ విశ్వనాధరెడ్డి, పబ్బతి వేణు, కామిని మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వాటర్ షెడ్లను సద్వినియోగం చేసుకోండి


చెక్కులను పంపిణీ చేసిన నాబార్డ్ డీడీఎం కార్తీక్

గడివేముల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వాటర్ షెడ్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నాబార్డ్ జిల్లా డెవలప్‌మెంట్ మేనేజర్ కార్తీక్ దొరై రైతులకు సూచించారు. గురువారం ఆయన మండలంలోని గని గ్రామంలో నాబార్డ్ ఆధ్వర్యంలో జరిగిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పంట సాగులో సస్యరక్షణ చర్యలను పాటించాలని అన్నారు. జీవనోపాధి కార్యక్రమంలో భాగంగా రైతులకు చెక్కులను పంపిణీ చేశారు. పంట పొలాల్లో చేపట్టిన చెక్‌డ్యామ్, పండ్ల తోటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నవయూత్ అసోసియేషన్ అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, డైరెక్టర్ నరసింహులు, ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మీనారాయణ, ఇంజనీర్ హరిబాబు, టీడీపీ నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాగులో నూతన పద్ధతులు పాటించాలి

నంద్యాల రూరల్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): రైతులు వరి సాగులో నూతన పద్ధతులు పాటించాలని నంద్యాల ఆర్ఏఆర్ఎస్ సంచాలకులు డాక్టర్ జాన్సన్ అన్నారు. గురువారం కొత్తపల్లిలో ఆర్ఏఆర్ఎస్, ఏరువాక, కేంద్రం ఆధ్వర్యంలో మారుటేరువారు రూపొందించిన ఎంటీయూ1426 వరిరకం క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రైతులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతి తీరని లోటు

ఆత్మకూరురూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దపల్లి టీడీపీ సీనియర్ నాయకుడు సిం గారెడ్డి పెద్ద సంజీవ రెడ్డి (82) మృతి పార్టీకి తీరని లోటని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం సంజీవరెడ్డి మృతి చెందారు. ఎమ్మెల్యే చరవాణిలో బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. స్థానిక నాయకులుఆయన మృతిపై సంతాపం వెలిబుచ్చారు.

శ్రీశైలంలో శ్రీపాద వల్లభుడికి పూజలు

శ్రీశైలం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైల దేవస్థానం నిర్వహించే వార పూజల్లో భాగంగా త్రిఫల వృక్షం క్రింద కొలువైఉన్న శ్రీపాద వల్లభుడైన దత్తాత్రేయస్వామికి గురువారం ఉదయం పంచామృతాభిషేకాలు, విశేషార్చనలు, పూజలు చేశారు. బ్రహ్మవిష్ణు, మహేశ్వరులు ఒకే స్వరూపంలో దత్తాత్రేయునిగా అవతరించారని ఆలయ స్థానాచార్యులు పూర్ణానంద తెలిపారు. సాయంత్రం కళారాధన వేదికపై రాజమండ్రికి చెందిన రాజరాజేశ్వరి కూచుపూడి కళాశాల బృందంచే వివిధ భక్తి గీతాలకు శరణ్య, శ్రీవల్లిక, అక్షిత, బిందు, ప్రణమ్య, చాతుర్య, లలిత, వేదశ్రీ, పల్లవి, రూప, సహస్ర, అఖిలలు చేసిన సంప్రదాయ నృత్యాలు యాత్రికులను అలరించాయి.

శ్రీశైల పాలక కమిటీ చైర్మన్‌కు అభినందనలు


ఆలయ చైర్మన్ రమేష్ నాయుడుకు జ్ఞాపికను ఇస్తున్న చెంచులు

శ్రీశైలం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తరతరాలుగా వందల సంవత్సరాల నుంచి క్షేత్రానికి కాపలాదారులుగా, ప్రధాన అర్చకులుగా ఉండే తాము క్రమక్రమంగా మల్లన్నకు దూరమయ్యే పరిస్థితులలో తమ ప్రాధాన్యతను గుర్తించినందుకు పాలక చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడుకు చెంచులు అభినందనలు తెలిపారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించుకున్నారు. చైర్మన్ మాట్లాడుతూ క్షేత్రంలో చెంచుల పూర్వ వైభవాన్ని పునరుద్ధరించేందుకు కృషి చేస్తానన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు

- పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి
- ముగిసిన వారోత్సవాలు


నందికొట్కూరులో విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి


పాణ్యంలో దేశనాయకుల చిత్రపటాలను ఆవిష్కరిస్తున్న అధికారులు,

నందికొట్కూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన సంపదకు గ్రంథాలయాలు నిలయాలని పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని గ్రంథాలయంలో గ్రంథపాలకుడు మురళి అధ్యక్షతన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎలా వెళ్లాలో దిశా నిర్దేశం చేశారు. ఆయా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు, ప్రభుత్వ అసిస్టెంట్ న్యాయవాది మహేశ్వరుడు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాణ్యం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. స్థానిక గ్రంతాలయానికి దేశ నాయకుల చిత్రపటాలను టీడీపీ నాయకుడు రాంపుల్లారెడ్డి అందజేయగా ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ఎంపీటీసీ రంగరమేష్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి భాగ్యలక్ష్మి, ఎంఈవో సుబ్రహ్మణ్యం, మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ దినేశ్‌బాబు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి, విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: గ్రంథాలయాలు విజ్ఞాన వికాస కేంద్రాలని గ్రంథాలయ అధికారి రాకేష్ అన్నారు. గురువారం పట్టణంలోని కార్యాలయంలో వారోత్సవాలు ముగిశాయి.

కేంద్ర పథకాల్లో జాప్యం తగదు

(5వ పేజీ తరువాయి)

ఈ సమావేశంలో కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు నిర్ణీత కాల వ్యవధిలో పూర్తిచేయాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై) అనేది ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే పంట నష్టాల రైతులకు ఆర్థిక సాయం అందుతుందని అన్నారు. రబీ, ఖరీఫ్ సీజన్‌లో పండించే పంటలకు తప్పనిసరిగా పంట బీమా కల్పించేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పశు సంవర్ధక శాఖకు సంబంధించి జిల్లాలో ఇప్పటి వరకు 57,392 పాడి పశువులున్నాయని, వాటిని పెంచడానికి పశువులు లేని వారికి పశువులిచ్చి ప్రోత్సహించామన్నారు. జలకనూరు రిజర్వాయర్ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా విద్యుత్ కనెక్షన్ల ద్వారా నీటిని తీసుకుంటున్నారని వాటిని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈని కలెక్టర్ ఆదేశించారు. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ.. 340సీ కు సంబంధించిన పనులు నాణ్యంగా జరిగేలా చూడాలన్నారు. అండర్ పాత్ నిర్మాణాలు చాలా దూరంగా వేయడం ద్వారా ప్రజలు రోడ్డు దాటడానికి ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. జల్‌మార్గ్ వికాస్ ప్రాజెక్టు(జేఎంవీపీ) జిల్లాను పర్యాటక పరంగా అభివృద్ధి చేయాలని, శ్రీశైలానికి వెళ్లడానికి సింగిల్ రోడ్డు ఉండటం వల్ల అధిక సమయం పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి, డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, ఎంపీపీలు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి


పాములపాడులో జెండా ఎగురవేస్తున్న సొసైటీ చైర్మన్ గోవిందు

పాములపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని సొసైటీ చైర్మన్ రాయపాటి గోవిందు అన్నారు. గురువారం పాములపాడులో ఆంధ్రప్రగతి సేవా సహకారసంఘం వారోత్సవాలను సంఘం మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మణ్ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా చైర్మన్ జెండా ఎగుర వేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు బంగారంపై రుణాలను తక్కువ వడ్డీకే అందిస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, సంఘసభ్యులు పాల్గొన్నారు. అలాగే మద్దూరు సహకార సొసైటీలో వారోత్సవాలను సొసైటీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నీటిసంఘం అధ్యక్షుడు తిమ్మారెడ్డి, సొసైటీ డైరెక్టర్ వీర క్రిష్టుడు, బసిరెడ్డి అరుణమ్మ, సంఘం సీఈవో ముర్తుజావలి, రైతులు పాల్గొన్నారు.

24న దివ్యాంగుల ఉపకరణాల నిర్ధారణ శిబిరం

పాములపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 24న దివ్యాంగుల సహాయ ఉపకరణాల నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి బాలాజీనాయక్ తెలిపారు. గురువారం ఎంఈవో మాట్లాడుతూ సమగ్రశిక్ష అధికారులు ప్రత్యేక శిబిరాన్ని మండలంలోని దివ్యాంగ విద్యార్థులకు నిర్వహించనున్నారన్నారు. నిర్ధారణ పరీక్షలకు హాజరయ్యే దివ్యాంగ విద్యార్థులు ఆధార్, సదరం సర్టిఫికెట్, యూడీఐడీ, రేషన్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం తీసుకెళ్లాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రతి దివ్యాంగ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

25న నందికొట్కూరులో..

జూపాడుబంగ్లా: మండలంలోని ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా సహాయ ఉపకరణాలను అందించేందుకు ఈనెల 25న నందికొట్కూరు సీఎస్ఐ చర్చి పాఠశాల ఆవరణలో మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఐఈఆర్‌టీ మండల కోఆర్డినేటర్ నాగేంద్ర తెలిపారు. శిబిరానికి హాజరయ్యే 3 నుంచి 18 ఏళ్లలోపు ప్రత్యేక అవసరాల పిల్లలు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు.

సెలవు రోజుల్లో మినహాయింపు ఇవ్వాలి

వెలుగోడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల కోసం ప్రభుత్వం రూపొందించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను సెలవు రోజుల్లో లేకుండా, పాఠశాల పనిదినాల్లో మాత్రమే నిర్వహించాలని పీఆర్‌టీయూ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రాంపక్కిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చాంద్‌బాషా ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండలంలోని ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేయించారు. పీఆర్‌టీయూ నాయకులు సయ్యద్ మొహమ్మద్దీన్, అబ్దుల్ అహ్మద్, నూర్ మొహమ్మద్, హుస్సేన్ సాహెబ్, మహేశ్, మునిరెడ్డి, బాపూజీ నాయక్ పాల్గొన్నారు.

ఆదాయాన్ని పెంచుకోవాలి

జూపాడుబంగ్లా, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవాలని వెలుగు ఏపీఎం అంబమ్మ సూచించారు. గురువారం మండలంలోని 80బన్నూరు, తాటిపాడు గ్రామాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ టీచర్లు, వీవోఏలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

ఆత్మరక్షణ విద్యను నేర్చుకోవాలి

నంద్యాల టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆత్మరక్షణ విద్యను నేర్చుకోవాలని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ జయరాములు అన్నారు. గురువారం పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో శక్తి యాప్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ మహిళలకు ఆపద వస్తే 112నంబరుకు ఫోన్ చేయాలని, నేరాలు జరిగినప్పుడు 1930కు ఫోన్ చేయాలని సూచించారు. మహిళలు ధైర్యంగా ఉండాలని, భవిష్యత్తులో ఉన్నతంగా రాణించాలన్నారు. కార్యక్రమంలో శక్తి సిబ్బంది చాంద్‌బాష తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ నందీశ్వరుడి గ్రామోత్సవం

నంద్యాల కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రథమనందీశ్వరాలయంలో స్వామివారిని నందివాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. గురువారం ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు, కేదారేశ్వరీ దేవి అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు అంగరంగ వైభవంగా కోలాటప్రదర్శన, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో గ్రామోత్సవం నిర్వహించారు.అర్చకులు ప్రవీన్‌కుమార్, చలంబాబు, భక్తులు పాల్గొన్నారు.

ఓంకారం హుండీ లెక్కింపు

బండిఆత్మకూరు, నవంబరు20(ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో వెలసి ఉన్న ఓంకార క్షేత్రం హుండీని దేవస్థానం అధికారులు లెక్కించారు. స్వామి, అమ్మవారి హుండీల ద్వారా రూ.3,34,896 ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ చెన్నారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఈవో ఆకృతి నాగప్రసాద్, ఈశ్వరరెడ్డి, అర్చకలు, నంద్యాల సేవకులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

పాములపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో ప్రజలు సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ రామాంజీనాయక్ అన్నారు. గురువారం ఇస్కాల గ్రామంలో పాముల పాడు మండలం ఐసీఐ సురేశ్ ఆధ్వర్యంలో గ్రామసభలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఐ సురేశ్‌కుమార్‌రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అవార్డు రావడంపై హర్షం

నంద్యాల రూరల్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన అంజద్ బాషా సిద్దికి డాక్టర్ అబ్దుల్ హక్ అవార్డు రావడంపై టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక సాయిబాబా నగర్‌లోని కుబ్రా మసీదులో అవార్డు అందుకున్న సిద్దికిని సన్మానించారు. ఇమామ్‌ల సంఘం నాయకులు మౌలానా మహబూబ్‌బాష, రఫీ, హఫీజ్ అబ్దుల్, పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల్లో వసతులు కల్పించాలి

ప్యాపిలి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పది పరీక్ష కేంద్రాల్లో వసతులు కల్పించాలని డిప్యూటీ డీఈవో వెంకటరామిరెడ్డి హెచ్ఎంలకు సూచించారు. గురువారం పట్టణంలో ప్రభుత్వ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల్లోని పది పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చిలో ప్రారంభమ్యే పది పరీక్షలకు సంబంధించి కేంద్రాల ను పరిశీలించి వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట ఎంఈవోలు మహేశ్వరరెడ్డి, వెంకటేశ్వరనాయక్, రామాంజినేయులు ఉన్నారు.

మెనూ తప్పనిసరిగా పాటించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో, హెచ్ఎం

చాగలమర్రి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంఈవో న్యామతుల్ల మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. గురువారం మండలంలోని శెట్టివీడు ప్రాథమిక పాఠశాలను ఎంఈవో తనిఖీ చేసి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం మహబూబ్ బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

114 అనుమానిత కేసులు నమోదు

చాగలమర్రి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో ఇంటింటా కుష్ఠువ్యాధి లక్షణాల గుర్తింపు సర్వే కార్యక్రమంలో 114 అను మానిత కేసులను గుర్తించినట్లు నోడల్ పర్సన్ రామలింగారెడ్డి తెలిపారు. గురువారం ఆర్సీఎం పాఠశాలలో వైద్యులు అంజలి ఆధ్వర్యంలో సంచార చికిత్స కార్యక్రమంలో భాగంగా అనుమానిత కేసులను పరిశీలించారు. ఎంఎల్‌హెచ్‌పీ సురేంద్ర, ఏఎన్ఎం గార్లేట్, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలి

కోవెలకుంట్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం ఎంపీడీవో వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు నవీన్ మాదిగ, దండు మాదిగ టౌన్ అధ్యక్షుడు రమేశ్‌లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించాలని కోరారు.

కుక్క దాడిలో ఐదుగురికి గాయాలు

ఉయ్యాలవాడ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాయలూరు గ్రామంలో కుక్క స్వైరవిహారం చేసింది. గురువారం గ్రామంలో ఉన్న ఐదుగురిపై దాడిచేసి కరచినట్లు ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి కెనెడి తెలిపారు. వారికి యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ ఇచ్చి, మెరుగైన వైద్యం కోసం కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు పంపినట్లు తెలిపారు.

అక్రమ వ్యాపారాలు చేస్తే చర్యలు



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్

ప్యాపిలి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అక్రమ వ్యాపారాలు చేస్తే చర్యలు తప్పవని తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఎరువుల దుకాణ యజమానులను హెచ్చరించారు. గురువారం పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఎమ్మార్పీ లేని వస్తువులను విక్రయించి ప్రజలను మోసం చేస్తున్న ఐదు దుకాణాలకు ఆయన రూ.18వేలు జరిమానా విధించారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ కాలం చెల్లిన ఆహార పదార్థాలను, ఇతర వస్తువులను విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

భాస్కర్ మృతి పార్టీకి తీరని లోటు

డోన్ రూరల్, నవంబరు 20(ఆంధ్రజోతి): డోన్ ఏఐటీయూసీ అనుబంధ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు భాస్కర్ మృతి సీపీఐకి తీరని లోటని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్యలు అన్నారు. గురువారం భాస్కర్ అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మోట రాముడు, నారాయణ, పుల్లయ్య, ప్రజానాట్యమండలి నాయకులు కోయలకొండ నాగరాజు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బనగానపల్లె, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో నాగరాజు సూచించారు. గురువారం ఉదయం మిట్టపల్లె గ్రామంలో గ్రీన్ అంబాసిడర్ డోర్‌టు, డోర్ చెత్తసేకరణ కార్యక్రమాన్ని ఎంపీడీవో నాగరాజు, డిప్యూటీ ఎంపీడీవో బాలాంజనేయులు, సర్పంచ్ తులసిరెడ్డితో కలసి పర్యవేక్షించారు. గ్రామస్థులు చెత్తవాహనాల్లో మాత్రమే చెత్తను వేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఉపసర్పంచ్ హైమావతి, రామసుబ్బారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

డెయిరీ ఎన్నికలు వాయిదా

రుద్రవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకంబలూరు గ్రామంలో డెయిరీ ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం పాలకవర్గ సభ్యుల ఎన్నికలు గురువారం వాయిదా వేసినట్లు ఎంపీడీవో భాగ్యలక్ష్మి తెలిపారు. ఎన్నికల అధికారులు మధ్యాహ్నం 2 వరకు రాకపోవడంతో ఎన్నికలను వాయిదా వేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

● మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి
● ముగిసిన జాతీయ గంథ్రాలయ వారోత్సవాలు



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి ఆధునిక ప్రపంచంలో గ్రంథాలయాల ప్రాముఖ్యత రోజురోజుకు తగ్గిపోతోందన్నారు. గ్రంథాలయ పితామహుడు గాడిచెర్ల సర్వోత్తమరావు విద్యావ్యవస్థను బాగు చేయాలనే సదుద్దేశ్యంతో గ్రంథాల యాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని ఒక అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. ఈసందర్భంగా వివిధ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య, సొసైటీ చైర్మన్ అబ్దుల్‌కలాం, భరతుడు, ఇస్మాయిల్‌ఖాన్, పణి, రిటైర్డు హెచ్ఎం శ్రీరాములు, టీచర్ నాగరాజు, మల్లారెడ్డి, సుబ్రహ్మణ్యం, అబిలాష్, మణి, గ్రంథాలయాధికారి మధుశేఖర్ , అరుణగీతామణి, శరత్‌బాబు పాల్గొన్నారు.

● స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఇన్‌చార్జి లైబేరియన్ నాగతిమ్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, బుక్‌రివ్యూ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లలిత, వైస్ ప్రిన్సిపాల్ బడేసాహెబ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అధ్యక్షతన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడుతూ గ్రంథాలయాలు తరతరాల సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలన్నారు. అనంతరం వ్యాసరచన వకృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు కేవీ రమణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి క్రిష్ణదాసు, భాస్కర్‌నాయక్, నరేంద్రనాథరెడ్డి, లక్ష్మీదేవి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

చాగలమర్రి: స్థానిక గ్రంథాలయంలో చిత్రలేఖనం, వ్యాసరచన, వకృత్వ పోటీల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు గురువారం గ్రంథాలయాధికారి రామచంద్రుడు బహుమతులను అందజేశారు. హెచ్ఎం ప్రసాద్, కాంతారావు, లాలయ్య, నాగేంద్ర పాల్గొన్నారు.

అవుకు: పట్టణంలో గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. గ్రంథాల ఇన్‌చార్జి రామదాసు ఆధ్వర్యంలో అవుకు జడ్పీ బాలురు, బాలికలు ఉన్నత పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, మ్యూజికల్ చైర్, పరుగు పందెం పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీధర్‌రావు, హెచ్ఎంలు మల్లీశ్వరి, సుబ్బయ్య, ఉపాధ్యాయురాలు విజయకుమారి పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు వైస్ ప్రిన్సిపాల్ గంగన్న బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు గాయత్రి, విజయలక్ష్మి, నాగమస్తాన్, కాశివిశ్వనాథ్, ప్రహల్లాదుడు, జయచంద్రుడు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామంలో మాజీ గ్రంథాల యాధికారి పల్లె నరసింహారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాథమిక పాఠశాల హెచ్ఎం లక్ష్మీపార్వతి, గ్రామస్థులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: స్థానిక గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, చిత్ర లేఖనం, ఆటల పోటీలను నిర్వహించామని గ్రంథాలయాదికారి అఖిలా బేగం తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు ఎంఈవో మనోహర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు చెన్న కేశ్వరి బహుమతులు అందించినట్లు ఆమె తెలిపారు.



ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, అవుకులో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న అధికారులు

బస్సు కోసం పరుగో.. పరుగు

రద్దీకి తగ్గ బస్సులు లేక ప్రయాణికుల అవస్థలు

బేతంచెర్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీశక్తి ఉచిత బస్సు సర్వీసు పథకం మహిళల పాలిట పరుగు పందేలుగా మారాయి. గురువారం బేతం చెర్ల ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికుల రద్దీకి తగ్గట్లు బస్సులు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్రతి డిపో పరిధిలో ఉచిత బస్సు పథకం ద్వారా మహిళా ప్రయాణికుల రాకపోకలు రెట్టింపుగా పెరిగినప్పటికీ గతంలో ఉన్న బస్సులనే ప్రభుత్వం నడుపుతుండటంతో తీవ్ర రద్దీ ఏర్పడింది. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో సీటు కోసం మహిళలు పరుగులు పెట్టడం తీరా బస్సు ఎక్కాక సీటు కోసం గొడవలు పడటం సర్వసాధారణమైంది. ఇప్పటికైనా ప్రభుత్వం బస్సుల సంఖ్య పెంచాలని ప్రయాణికులు ఆర్టీసీ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆర్టీసీ బస్టాండులో బస్సు కోసం పరుగులు తీస్తున్న మహిళలు

వీరాంజనేయస్వామి ఆలయంలో పూజలు



వీరాంజనేయస్వామిని దర్శించుకుంటున్న కోట్ల రాఘవేంద్రరెడ్డి

డోన్ టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతపేటలో వెలసిన ద్రోణాపురి వీరాంజనేయస్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా స్వామివారికి ఆలయ పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ యువ నాయకుడు కోట్ల రాఘవేంద్ర రెడ్డి హాజరై స్వామి వారికి పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి రథోత్సవాన్ని ఆలయ వీధుల్లో ఊరేగించారు. అనంతరం పాతబ స్టాండు సమీపంలోని దుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని కోట్ల రాఘవేంద్రరెడ్డి దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రుద్రవరం: స్థానిక పడమటివీధిలో వెలసిన అంజనేయస్వామికి గురువారం అమావాస్య పూజలు నిర్వహించారు. అర్చకులు వారణాసి గోపిశర్మ అంజనేయస్వామి అభిషేకాలు, తదితర పూజలు చేశారు. అలాగే రుద్రవరంలోని భాస్కర నందీశ్వరాలయంలో, కొండమాయపల్లెలో ఆంజనేయుడికి అమావాస్య పూజలు చేశారు.

అమ్మవారికి లక్ష కుంకుమార్చన

చాగలమర్రి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక భీమలింగేశ్వర ఆలయంలో గురువారం కార్తీకమాసం సందర్భంగా మహిళలు సామూహికంగా పార్వతిదేవి అమ్మవారికి లక్ష కుంకుమార్చన చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శివపార్వతుల పల్లకి ఉత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ధర్మకర్త శివనాగయ్య, మహిళలు పాల్గొన్నారు.

కార్తీక మాస ముగింపు పూజలు

కొలిమిగుండ్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రాల్లో గురువారం కార్తీక మాసం ముగింపు పూజలు నిర్వహించారు. కొలిమిగుండ్ల లలితాసుందరేశ్వరస్వామి, నేలబిళం మల్లేశ్వర స్వామి, పేట్నికోట కాశీ విశ్వేశ్వరస్వామి, బెలుం సిద్ద రామేశ్వరస్వామి ఆలయాల్లో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.

శివస్వాములకు భిక్ష

కోవెలకుంట్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి, కోవెలకుంట్ల మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శివస్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. గురువారం ప్రజలు సాయిబాబాకు పూజలు చేశారు. అనంతరం స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు.

పూజలు చేసి మోక్షఫలం పొందండి

రుద్రవరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో పూజలు చేసి మోక్షఫలం పొందాలని కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన వేదాంతగీత శివ ఫౌండేషన్ ఆచార్య అభినవ శంకరానందస్వామి అన్నారు. గురువారం రాత్రి రుద్రవరంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. ప్రధాన అర్చకులు వారణాసి గోపిశర్మ, అయ్యప్పస్వామి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల నామినేషన్‌పై ఉత్కంఠ

చాగలమర్రి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలపాడు సొసైటీకి ఖాళీ ఏర్పడ్డ 2 డైరెక్టర్ల స్థానానికి గురువారం నామినేషన్ల ప్రక్రియ జరగాల్సి ఉంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సంబంధిత ఎన్నికల అధికారి రాకపోవడంతో నామినేషన్ నిర్వహించలేదు. సంబంధిత ఎన్నికల అధికారి నామినేషన్ల స్వీకరణకు గైర్హాజరయ్యారు. దీంతో డైరెక్టర్ల నామినేషన్ ప్రక్రియ జరగలేదు. వాయిదా వేశారా లేక ఏకగ్రీవంగా నిర్వహిస్తారా అనే ఉత్కంఠత నెలకొంది.

సీఐ సేవలు అభినందనీయం



సీఐ రమేష్‌బాబును సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కొలిమిగుండ్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నేలబిళం తిరునాళ్ల ఉత్సవాలు విజయవంతం చేయడంలో కొలిమిగుండ్ల సీఐ రమేష్ బాబు సేవలు అభినందనీయమని ఆలయ కమిటీ సభ్యులు కొనియాడారు. గురువారం నేలబిళం మల్లేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు సీఐ రమేష్‌బాబును ఘనంగా సన్మానించారు. రెండు రోజుల ముందు నుంచి సీఐ ఆలయ కమిటీ సభ్యులతో చర్చించి, వాహనాల పార్కింగ్, క్యూలైన్లు, దుకాణాల ఏర్పాటు విషయంలో జాగ్రత్తలు తీసుకోవడంతో ఉత్సవాలు విజయవంతమైనట్లు వారు పేర్కొన్నారు.

మానవ సంబంధాలు పెంచుకోవాలి

బనగానపల్లె, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మానవ సంబంధాలను పెంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జమాయితే ఇస్లామి హింద్ బనగానపల్లె అధ్యక్షుడు గౌస్‌బాషా అన్నారు. గురువారం మానవ సంబంధాలపై సంఘం సభ్యులతో కలసి పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మానవ సంబంధాలు పెంచడానికి ఈనెల 21 నుంచి 30 వరకు దేశ వ్యాప్తంగా తమ సంస్థ చైతన్య సద స్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా విభాగం కార్యకర్తలు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి

బనగానపల్లె, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నప్పటి నుంచే పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి అన్నారు. గురువారం మండలం లోని రామతీర్థం ప్రాథమిక పాఠశాలలో బాలల హక్కుల దినోత్సవం పురస్కరించుకొని పొదుపు విశిష్టలను వివరించారు. ఈసందర్భంగా నిర్వహించిన ప్రతిభా పోటీల్లో విజతేలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే చైతన్య వేదిక లక్ష్యం

ఆళ్లగడ్డ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ కుటుంబాల సమస్యల పరిష్కారమే చైతన్య వేదక లక్ష్యమని బ్రాహ్మణ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన తరువాత జరిగిన ఎన్నికలలో టీడీపీ గెలుపు కోసం బ్రాహ్మణ చైతన్య వేదిక పని చేసిందన్నారు.

గ్రామాభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయాలి

కొలిమిగుండ్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కొలిమిగుండ్ల ఎంపీడీవో దస్తగిరిబాబు, డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి పేర్కొన్నారు. గురువారం కొలిమిగుండ్ల మండలం తోళ్లమడుగు గ్రామ పంచాయితీలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో నిర్వహించిన సామిత్వ సర్వే గ్రామ సమస్యలు ఇతర అంశాలపై ప్రజలతో చర్చించారు. సర్పంచ్ ఆదినారాయణ రెడ్డి, గోపాల్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

చిన్నారుల కడుపు కొడితే సహించం

ప్యాపిలి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): చిన్నారుల కడుపు కొడితే సహించమని ఎంపీడీవో శ్రీనివాసరావు హెచ్చరించారు. గురువారం మండలంలోని ఏనుగమర్రి గ్రామంలోని అంగవాడీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలన్నారు. గుడ్లు పక్కదారి పడితే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్ ఉన్నారు.

కేంద్ర పథకాల్లో జాప్యం తగదు

(5వ పేజీ తరువాయి)

ఈ సమావేశంలో కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు నిర్ణీత కాల వ్యవధిలో పూర్తిచేయాలన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై) అనేది ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే పంట నష్టాల రైతులకు ఆర్థిక సాయం అందుతుందని అన్నారు. రబీ, ఖరీఫ్ సీజన్‌లో పండించే పంటలకు తప్పనిసరిగా పంట బీమా కల్పించేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పశు సంవర్థక శాఖకు సంబంధించి జిల్లాలో ఇప్పటి వరకు 57,392 పాడి పశువులున్నాయని, వాటిని పెంచడానికి పశువులు లేని వారికి పశువు లిచ్చి ప్రోత్సహించామన్నారు. జలకనూరు రిజర్వాయర్ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా విద్యుత్ కనెక్షన్ల ద్వారా నీటిని తీసుకుంటున్నారని వాటిని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈని కలెక్టర్ ఆదేశించారు. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ 340సీకి సంబంధించిన పనులు నాణ్యంగా జరిగేలా చూడాలన్నారు. అండర్ పాత్ నిర్మాణాలు చాలా దూరంగా వేయడం ద్వారా ప్రజలు రోడ్డు దాటడానికి ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. జల్‌మార్గ్ వికాస్ ప్రాజెక్టు(జేఎంవీపీ) జిల్లాను పర్యాటకపరంగా అభివృద్ధి చేయాలని, శ్రీశైలానికి వెళ్లడానికి సింగిల్ రోడ్డు ఉండటం వల్ల అధిక సమయం పడుతుందని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, ఎంపీపీలు పాల్గొన్నారు.

చేపల వేటే ఆధారం

42 చెంచు కుటుంబాలకు జీవనోపాధి



చేపను చూపుతున్న గిరిజనుడు

రుద్రవరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రుద్రవరం మండలం హరినగరం చెంచుగూడెం చెంచులు చేపల వేటవృత్తిని ఎంచుకున్నారు. అడవి ఫలసాయం సేకరణకు స్వస్తి పలికి చేపల వేటే జీవనోపాధి ఎంచుకున్నారు. 42 కుటుంబాల చెంచులు చేపలను వేటాడి జీవనోపాధి పొందుతున్నారు. సహజంగానే తుండ్లవాగు రిజర్వాయరులో చేపలు వేట కొనసాగిస్తున్నారు. ఈ చేపల వేటలో ఒక్కొక్కరూ 8 నుంచి 10 కేజీలు చేపలు వేటాడుతారు. ఒక్కొక్కటి కేజీ నుంచి 10కేజీల వరకు చేప తూకం ఉంటుంది. ఒక్కో కేజీ వంద చొప్పున విక్రయించి ఉపాధి పొందుతున్నారు. జిలేబీ, బొచ్చ, రోకు, వాలుగ, కొరమీను రకాలు పట్టుబడతాయన్నారు.

చేపల వేటతో ఉపాధి



అటవీ ఫలసాయానికి స్వస్తి పలికి చేపల వేటతో జీవనోపాధి పొందుతున్నాము. 42 కుటుంబాలు చేపల వేటపై ఆధారపడ్డాం. ప్రతిరోజూ 40 మంది వేటకు వెళతాం. వేటాడి తెచ్చిన చేపలు విక్రయించి కుటుంబ పోషణకు ఖర్చు చేస్తున్నాం మరికొన్ని డబ్బులతో పిల్లలను చదివిస్తున్నాం.

● రవి, గిరిజనుడు, చేపల సొసైటీ అధ్యక్షుడు, హరినగరం

ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలి



ప్రసంగిస్తున్న వీరజానందస్వామి

శిరివెళ్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలని కడప జిల్లా బ్రహ్మంగారి మఠం అచాలనంద ఆశ్రమ స్వామిజీ వీరజానంద స్వామి అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా శిరివెళ్లలో గురువారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. సనాతన విలువలు, సంస్కృతి, ఐకమత్యం తదితర వాటి గురించి స్వామిజీ బోధించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

నేటి నుంచి హజరత్ హసన్ అలీ ఉరుసు



ఉత్సవాలకు ముస్తాబైన దర్గా

డోన్ టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండపేటలో వెలసిన హజరత్ హసన్ అలీ మౌలాలి స్వామివారి ఉరుసు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నట్లు దర్గా నిర్వాహకులు షేక్ అబ్దుల్ రెహి మాన్, షేక్ అహ్మద్ బాషా గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 21న సాయంత్రం 6 గంటలకు దర్గా పీఠాధిపతి దివంగత ఖాజా మాసూంవలి హుసేనీ ఇంటి నుంచి గంధం తీసుకెళ్లి దర్గాలో ఫాతేహాలు సమర్పిస్తారన్నారు. 22న స్వామివారి ఉపన్యాసాలు, అన్నదాన కార్యక్రమాలు, 23న జియారత్ కిస్తీ, దర్గా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రెహిమాన్ ఇంటి నుంచి తులసి, ముంతాజ్ ఇళ్ల నుంచి ప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ ఉత్సవాలకు హజరత్ ఖాజా సుభాన్ ఉసేన్‌షా స్వామి, సయ్యద్ ఖాజా పాషా మోబాలిగ్ తదితరులు హాజరై భక్తులనుద్దేశించి ఉపన్యాసాలు ఇస్తారన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

రుద్రవరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ మహ్మద్‌రఫి అన్నారు. గురువారం మండలంలోని పెద్దకంబలూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం తిరుపతయ్య, ఏఎస్ఐ భూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు బాబా నూర్‌బాషా పాల్గొన్నారు.

సర్వేపై నిర్లక్ష్యం వహించొద్దు

కొలిమిగుండ్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో చేపడుతున్న స్వామిత్వ సర్వేపై పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దని ఎంపీడీవో దస్తగిరిబాబు, డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. గురువారం స్వామిత్వ సర్వేపై వారు మాట్లాడుతూ పంచాయతీ సిబ్బంది ప్రజలతో చర్చించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

ఆళ్లగడ్డ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఎరువుల, పురుగు మందుల దుకాణాలను వ్యవసాయ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. స్థానిక మంజునాథ ట్రేడర్స్ దుకాణంలో మండల వ్యవసాయాధికారి కిషోర్ కుమార్‌రెడ్డి రికార్డులను పరిశీలించారు. ఎరువుల స్టాక్ నిలువలను తనిఖీ చేశారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

డోన్ టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కూటమి నాయకులు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.